




RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక








ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 157 | సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | సోమవారం - 27 - జూలై - 2026 | వెల రూ. 5 /-


# మృత్యుంజయుడు

## ఆగిన గుండె.. మళ్ళీ కొట్టుకుంది..

- పెద్ది సుదర్శన్ రెడ్డికి గుండెపోటు
  - గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌కు తరలింపు
- 9 సార్లు సీపీఆర్ చేసి ప్రాణం నిలిపిన డాక్టర్ మమతారెడ్డి
- రంగంలోకి దిగిన కేటీఆర్, హరీశ్‌రావు
  - ఎప్పటికప్పుడు ఆరా తీసిన కేసీఆర్
- ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు
  - వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి
- డాక్టర్ మమతపై హరీశ్‌రావు ప్రశంసల వర్షం
- పెద్ది త్వరగా కోలుకోవాలని నేతల ఆకాంక్ష



**నేటి శుభోదయ, వరంగల్ :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఆదివారం ఉదయం హనుమకొండలోని ఆయన నివాసంలో ఉన్న సమయంలో గుండెపోటు (హార్ట్ స్ట్రోక్) రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను వెంటనే వరంగల్‌లోని రోహిణి ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, మెరుగైన వైద్యం కోసం గ్రీన్ ఛానల్ ద్వారా ప్రత్యేక అంబులెన్స్‌లో సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు.

**9 సార్లు సీపీఆర్ చేసి ప్రాణాలు నిలిపిన డాక్టర్ మమతారెడ్డి**

రోహిణి ఆసుపత్రికి తీసుకువచ్చిన సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి గుండె లయ తప్పడంతో తీవ్ర విషమ పరిస్థితులు నెలకొన్నాయి. అత్యవసర విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ మమతారెడ్డి ఎంతో ధైర్యంతో, పట్టుదలతో చికిత్స అందించారు. గుండె ఆగిపోయినప్పటికీ ఆశ వదులుకోకుండా ఏక సీపీఆర్ (CPR) చేశారు. స్పందన రాకపోవడంతో, వేయకుండా 9వ సారి చేయడంతో గుండె లయ బడింది. దీనితో ఆయనకు ప్రాణాపాయం తప్పింది

**కేసీఆర్ ఆదేశాలు**

**– రంగంలోకి దిగిన కేటీఆర్, హరీశ్‌రావు**

పెద్ది సుదర్శన్ రెడ్డి అస్వస్థత వార్త తెలిసిన వెంటనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో అత్యుత్తమ చికిత్స అందేలా దగ్గరుండి చూడాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ఆదేశించారు. కేసీఆర్ ఆదేశాలతో కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు వెంటనే హనుమకొండకు చేరుకుని రోహిణి ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డిని అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా, వారి వాహన శ్రేణిలోనే అంబులెన్స్ వెంట ప్రయాణించారు.

**వైద్యుల హెల్త్ బులిటెన్**

**– వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి**

పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై రోహిణి ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి హెల్త్ బులిటెన్ విడుదల చేశారు. హార్ట్ స్ట్రోక్‌తో పాటు లంగ్స్ (ఊపిరితిత్తుల) ఇన్ఫెక్షన్ కూడా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ....

▸▸2

---

నందన్ నీలేకని నేతృత్వంలో

# హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

- పరీక్షల సంస్కరణ కోసం మోదీ కీలక నిర్ణయం



- పరీక్షల సంస్కరణలకు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్
- విశ్వసనీయ, పారదర్శక వ్యవస్థ ఏర్పాటు లక్ష్యమని ప్రకటించిన ప్రధాని
- ఈ టాస్క్‌ఫోర్స్ నివేదిక ఆధారంగా భవిష్యత్ చర్యలు ఉంటాయని వెల్లడి
- పేపర్ లీక్‌ల వివాదంతో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, విద్యాశాఖ నూతన మంత్రిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి

2

---

విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి

# రాజీనామా చేయాల్సిందే

- తెలంగాణ బీజేపీ డిమాండ్



- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వారంలోగా చెల్లించాలని సీఎం రేవంత్‌కు బీజేపీ అల్టిమేటం
- లేదంటే విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని రాంచందర్ రావు డిమాండ్
- నీట్ వివాదంలో యువతను రెచ్చగొట్టి ప్రధాని మోదీని బలహీనపరిచేందుకు కుట్ర జరిగిందని ఆరోపణ
- తెలంగాణలో పేపర్ లీక్‌లపై గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఎందుకు మౌనంగా ఉన్నాయన్న డీకే అరుణ

2

---

ప్రైవేట్ కంపెనీలపై

# హెచ్ఆర్‌సీకి అధికారం లేదు

: తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు



▸▸2

---

# 17 నుంచి అసెంబ్లీ.. ?

- వారం రోజులపాటు నిర్వహించే అవకాశం..



- తెగస్టు 17 నుంచి తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు?
- అసెంబ్లీ వర్కింగ్ డేస్‌పై అక్బరుద్దీన్ ఒవైసీ కుమార్తె వివాహ ప్రభావం
- ఆగస్టు 10లోగా కొత్త చాంబర్లు, సెంట్రల్ హాల్ పనులు పూర్తిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

▸▸2

---

## గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణం..

- మీరాబాయి చాను చారిత్రాత్మక 'గోల్డెన్ హ్యాట్రిక్'




- వరుసగా మూడో కామన్వెల్త్ గేమ్స్‌లోనూ మీరాబాయి చానుకు స్వర్ణం
- స్నాచ్ విభాగంలో సరికొత్త గేమ్స్, కామన్వెల్త్ రికార్డుల నమోదు
- పురుషుల 60 కేజీల విభాగంలో రిషికాంత సింగ్‌కు రజత పతకం
- రిషికాంత సైతం స్నాచ్‌లో కామన్వెల్త్ గేమ్స్ రికార్డు నమోదు
- గ్లాస్గో క్రీడల్లో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్‌కు ఘనమైన ఆరంభం

▸▸2

---

## పరారీలో ఉదయ్ కృష్ణారెడ్డి..

- గాలిస్తున్న పోలీసులు



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని జాతీయ పోలీస్ అకాడమీలో మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న తోటి ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి విచారణకు అందుబాటులో లేకుండా పోయాడు. ఉదయ్ కృష్ణారెడ్డికి నోటీసులు అందజేసేందుకు పోలీసులు ప్రయత్నించగా.. ఆయన పేరొన్న రెండు చిరునామాల్లోనూ ఆచూకీ లభించలేదు. ప్రస్తుతం ఉదయ్ కృష్ణారెడ్డి పరారీలో ఉన్నట్టు స్పష్టమవుతుండటంతో ఆయన ఆచూకీ కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఈ బృందాలు గత రెండ్రోజులుగా ఉదయ్ కృష్ణారెడ్డి కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి.

---

## కొమురవెల్లి రైల్వేస్టేషన్‌ను

# మరింత ఆధునీకరిస్తాం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**నేటి శుభోదయ, చేర్యాల/కొమురవెల్లి :** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ ప్రారంభం భక్తులకు, ప్రాంతీయ అభివృద్ధికి చరిత్రాత్మక ఘట్టమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి అన్నారు. కొమురవెల్లి మల్లన్న క్షేత్రం సమీపంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన రైల్వేస్టేషన్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీలు రఘునందన్‌రావు, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, పింగిలి శ్రీపాల్‌రెడ్డి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, సర్పంచ్ గొలపల్లి పద్మతో కలిసి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే సిద్దిపేట–సికింద్రాబాద్ డెమోను ప్రారంభించి కేంద్ర మంత్రి, ఎంపీలు కొమురవెల్లిలో రైలు ఎక్కి గజ్వేల్ స్టేషన్‌లో దిగారు. అనంతరం జరిగిన సభలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. కొమురవెల్లి స్టేషన్‌ను మరింత ఆధునీకరిస్తామని అన్నారు. అదనపు ప్లాట్‌ఫారాలు, మరిన్ని సౌకర్యాలు కల్పించాలని, రైల్వే స్టేషన్ నుంచి ఆలయం వరకు ఆర్టీసీ అధికారులు షటిల్ బస్సుల సేవలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాల్సిందే

## - తెలంగాణ బీజేపీ డిమాండ్

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వం, బీజేపీ మధ్య మాటల యుద్ధం ముదిరింది. వారం రోజుల్లోగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు రూ.12,000 కోట్ల ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో దాదాపు 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. "మేం మా చిత్తశుద్ధిని నిరూపించుకున్నాం, మీరు కూడా మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి" అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం జరిగిందంటూ ఇక్కడ ర్యాలీ తీసిన ముఖ్యమంత్రి, రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు.

మరోవైపు, బీజేపీ ఎంపీ డీకే అరుణ కూడా ఈ విషయంపై స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని అస్థిరపరిచేందుకు ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఓ వ్యక్తి యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడని ఆమె ఆరోపించారు. ఢిల్లీలో జరిగిన నిరసనల్లో విద్యార్థుల కన్నా బయటి ప్రాంతాల వారే ఎక్కువగా పాల్గొన్నారని, విదేశాల నుంచి నిధులు పంపి అల్లర్లు సృష్టించేందుకు దేశ వ్యతిరేకులు కుట్ర పన్నారని ఆమె సంచలన ఆరోపణలు చేశారు. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని డీకే అరుణ స్పష్టం చేశారు. పరీక్షను రద్దు చేసి, తక్కువ సమయంలోనే మళ్లీ నిర్వహించి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీయే యువతను రెచ్చగొట్టి దేశ ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. పార్లమెంటులో చర్చకు సిద్ధపడని రాహుల్ గాంధీ, నల్ల బట్టలు వేసుకుని వీధుల్లో నిరసనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 పేపర్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పదో తరగతి పేపర్ లీక్ అయినప్పుడు ఎవరూ ఎందుకు రాజీనామా చేయలేదని ఆమె నిలదీశారు.

# ప్రైవేట్ కంపెనీలపై హెచ్ఆర్సీకి అధికారం లేదు

## - తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు




**మొదటిపేజీ తరువాయి..** ప్రైవేట్ కంపెనీలు, వాటి ఉద్యోగులపై వచ్చే ఫిర్యాదులను విచారించే అధికారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు (హెచ్ఆర్సీ) లేదని తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. హెచ్ఆర్సీ పరిధి కేవలం ప్రభుత్వ ఉద్యోగులు, వారి నిర్లక్ష్యానికి సంబంధించిన అంశాలకే పరిమితమని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. వెల్స్ ఫార్గో ఇంటర్నేషనల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉద్యోగులు, తమకు పనిప్రదేశంలో వేధింపులు ఎదురయ్యాయని ఆరోపిస్తూ హెచ్ఆర్సీని ఆశ్రయించారు. దీనిపై హెచ్ఆర్సీ జారీ చేసిన ఆదేశాలను సవాలు చేస్తూ సదరు సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఉద్యోగ వివాదాలు, పనితీరు మదింపు వంటివి యజమాని, ఉద్యోగుల మధ్య ఉండే అంతర్గత వ్యవహారాలని ధర్మాసనం పేర్కొంది. ఇటువంటి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ప్రత్యేక చట్టపరమైన వేదికలు ఉన్నాయని తెలిపింది. ఆరోపణల తీవ్రతను బట్టి హెచ్ఆర్సీ తన అధికార పరిధిని విస్తరించుకోలేదని అభిప్రాయపడింది. ముఖ్యంగా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల వంటి ఫిర్యాదులకు 'పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్ చట్టం)' సరైన మార్గమని ధర్మాసనం సూచించింది. బాధితులు ఆ చట్టం కింద ఏర్పాటైన అంతర్గత కమిటీలను ఆశ్రయించాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో, హెచ్ఆర్సీ ముందు పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను కొట్టివేస్తూ, కంపెనీ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. అయితే, బాధితులు ఇతర చట్టాల ద్వారా న్యాయం పొందేందుకు స్వేచ్ఛ ఉందని తీర్పులో పేర్కొంది.

# మృత్యుంజయుడు

**మొదటిపేజీ తరువాయి..** సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను, వదంతులను ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

**డాక్టర్ మమతపై మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశంసల వర్షం**

సమయస్ఫూర్తితో, అసాధారణమైన నైపుణ్యంతో పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రాణాలను కాపాడిన డాక్టర్ మమతా రెడ్డిపై మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశంసలు కురిపించారు. ఎంతో ఒత్తిడిలోనూ వెనకడుగు వేయకుండా 9 సార్లు సీపీఆర్ చేసి ప్రాణాలు నిలిపిన ఆమె నిబద్ధత అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆమె చూపిన ధైర్యానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

**సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని నేతల ఆకాంక్ష**

సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ప్రస్తుతం ఆయనకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో మెరుగైన చికిత్స అందుతోంది. బిఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులతో పాటు పార్టీ ప్రజాప్రతినిధులు, నర్సంపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.



# నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్..

## - పరీక్షల సంస్కరణ కోసం మోదీ కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి..** దేశవ్యాప్తంగా పరీక్షల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, పేపర్ లీక్‌ల ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షల సంస్కరణల కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, ఆధార్ రూపశిల్పిగా పేరుగాంచిన నందన్ నీలేకని నేతృత్వంలో ఒక హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రకటించారు. ఈ టాస్క్‌ఫోర్స్ ఇచ్చే నివేదిక ఆధారంగా, భవిష్యత్తులో జరిగే పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "విద్యార్థుల భవిష్యత్తు కోసం భారత ప్రభుత్వం నిరంతరం అనేక చర్యలు తీసుకుంటోంది. వారి భవిష్యత్తుతో చెలగాటమాడిన వారు ఇప్పటికే జైళ్లలో మగ్గుతున్నారు. ఫాస్ట్-ట్రాక్ కోర్టులను కూడా ఏర్పాటు చేశాం. కఠినమైన చట్టపరమైన నిబంధనలతో కొత్త చట్టాన్ని పార్లమెంటులో తీసుకురావడానికి కూడా సిద్ధమవుతున్నాం. అయితే, మనం భవిష్యత్తును కూడా చూడాలి. మన పరీక్షా వ్యవస్థ విశ్వసనీయంగా, పారదర్శకంగా ఉండాలి. సాంకేతికతను గరిష్ఠంగా వినియోగించుకోవాలి. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ నిపుణుడు నందన్ నీలేకని నాయకత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం" అని వివరించారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో నీలేకనితో పాటు ఇస్రో మాజీ ఛైర్మన్ ఎస్. సోమనాథ్, ఐబీ మాజీ డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ చెన్నై డైరెక్టర్ వి. కామకోటి, మాజీ విద్యాశాఖ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్ నిపుణుడు అమృత్ లాల్ మీనా వంటి ప్రముఖులు సభ్యులుగా ఉంటారని అధికారిక ప్రకటన వెలువడింది. ఈ కమిటీ పరీక్షల సంస్కరణలపై దృష్టి సారించి, వీలైనంత త్వరగా నివేదిక సమర్పిస్తుందని ప్రధాని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ పోటీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, పేపర్లు లీక్ అయ్యాయని ఆరోపిస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నిరసనల కారణంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో, ప్రస్తుతం కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రిగా ఉన్న ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అదనపు బాధ్యతలను అప్పగించారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. వినయంతో, పూర్తి బాధ్యతాయుతంగా ఈ విధులను నిర్వర్తిస్తానని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. తీవ్రమైన ఆరోపణలు, విద్యార్థుల ఆందోళనలతో విద్యాశాఖ గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో ప్రహ్లాద్ జోషి నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది.

# 17 నుంచి అసెంబ్లీ.. ?

**మొదటిపేజీ తరువాయి..** రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాలను ఆగస్టు 17 నుంచి ప్రారంభించే అవకాశం ఉన్నది. మార్చిలో బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఇప్పటి వరకు సమావేశాలు జరుగలేదు. సాధారణంగా సమావేశానికి, సమావేశానికి మధ్య ఆరు నెలలు మించవద్దు. ఈ లెక్కన సెప్టెంబర్‌లోపు శాసనసభ సమావేశాలు జరుగాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆగస్టులో కనీసం వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. అన్నీ అనుకూలిస్తే ఆగస్టు 17 నుంచి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే, ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ కూతురు పెండ్లి ఆగస్టు 20న లండన్‌లో జరుగనున్నది. దీంతో ఎంఐఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లండన్ వెళ్లే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో 17న మొదలుపెట్టి మూడు రోజుల్లోనే ముగిస్తారా? లేక ఆగస్టు 24 నుంచి మొదలుపెడ్తారా? అనేది చూడాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఆదివారం కొన్ని జాతీయ మీడియా చానళ్లతో మాట్లాడుతూ.. ఆగస్టులో శాసనసభ సమావేశాలు పెడ్తామని, ఈ సమావేశాల్లో.. ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీచేసే వారి కనీస వయోపరిమితిని 25 ఏండ్ల నుంచి 21 సంవత్సరాలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఒక తీర్మానం పంపిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో మరికొన్ని తీర్మానాలు, బిల్లులు పెట్టే అవకాశం ఉన్నది. శాసనసభ, శాసనమండలిలో ఆధునీకరించిన భవన సముదాయాలను సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభకు వచ్చిన రేవంత్‌రెడ్డి.. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సెంట్రల్ హాల్ సహా మంత్రుల చాంబర్ల పునర్నిర్మాణ పనులను ఆగస్టు 10లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

# గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణం...

## - మీరాబాయి చాను చారిత్రాత్మక 'గోల్డెన్ హ్యాట్రిక్'

**మొదటిపేజీ తరువాయి..** కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత క్రీడాకారులు తమ సత్తాను ఘనంగా చాటుకున్నారు. భారత వెయిట్‌లిఫ్టింగ్ చరిత్రలో మరో స్వర్ణాధ్యాయాన్ని లిఖిస్తూ స్టార్ లిఫ్టర్, ఒలింపిక్ పతక విజేత మీరాబాయి చాను మహిళల 48 కేజీల విభాగంలో పసిడి పతకాన్ని ముద్దాడింది. ఆదివారం జరిగిన ఈ పోటీలో అద్వితీయ ప్రదర్శన కనబరిచిన ఆమె, వరుసగా మూడోసారి కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణం గెలిచి చారిత్రాత్మక హ్యాట్రిక్ పూర్తి చేసింది. ఈ క్రమంలో సరికొత్త గేమ్స్, కామన్వెల్త్ రికార్డులను సైతం బద్దలు కొట్టింది. టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత అయిన మీరాబాయి, ఈ పోటీలో ఆరంభంలో కాస్త తడబడింది. స్నాచ్ విభాగంలో 82 కేజీల బరువును తొలి ప్రయత్నంలో విఫలమైనప్పటికీ, రెండో ప్రయత్నంలో దానిని విజయవంతంగా ఎత్తింది. ఇక మూడో ప్రయత్నంలో ఏకంగా 85 కేజీల బరువును అవలీలగా ఎత్తి, సరికొత్త గేమ్స్, కామన్వెల్త్ రికార్డును తన పేరిట లిఖించుకుంది. దీంతో క్లీన్ అండ్ జెర్క్ విభాగానికి ముందే ప్రత్యర్థులపై 8 కిలోల భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. ఆ తర్వాత క్లీన్ అండ్ జెర్క్‌లోనూ తొలి ప్రయత్నం లో విఫలమైనా, ఛాంపియన్‌కు తగ్గ రీతిలో పుంజుకుని రెండో ప్రయత్నంలో 105 కేజీల బరువును ఎత్తి స్వర్ణ పతకాన్ని ఖాయం చేసుకుంది. 2018 గోల్డ్ కోస్ట్, 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల తర్వాత మీరాబాయికి ఇది వరుసగా మూడో కామన్వెల్త్ స్వర్ణం కావడం విశేషం. అంతకుముందు, పురుషుల 60 కేజీల విభాగంలో రిషికాంత సింగ్ చనమ్‌బమ్ అద్భుత ప్రదర్శనతో రజత పతకం గెలిచి ఈ క్రీడల్లో భారత్ పతకాల ఖాతాను తెరిచాడు. రిషికాంత స్నాచ్ విభాగంలో 121 కేజీల బరువును ఎత్తి గతంలో ఉన్న 120 కేజీల కామన్వెల్త్ గేమ్స్ రికార్డును అధిగమించాడు. అనంతరం క్లీన్ అండ్ జెర్క్‌లో 143 కేజీలు ఎత్తడంతో, మొత్తంగా 264 కేజీలతో వెండి పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ఈవెంట్‌లో మలేషియాకు చెందిన బిన్ కసాన్ మహ్మద్ అనిక్ (273 కేజీలు) స్వర్ణం గెలుచుకోగా, కెన్యాకు చెందిన జాషువా అముంగా (260 కేజీలు) కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని బోనాలు ఎత్తిన మహిళలు





**ఏన్కూర్, జూలై 26, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల పరిధిలోని తుతక్క లింగన్నపేట, కేసు పల్లి గ్రామంలో గ్రామ ప్రజలు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి జలాభిషేకం చేశారు. ఈ ఏడాది అత్యధిక వర్షాలు కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సుఖసంతోషాలతో ఉండాలని గ్రామస్తులు సామూహికంగా పూజలు చేశారు.ఆషాఢ మాసం సందర్భంగా సంప్రదాయబద్ధంగా మహిళలు బోనం ఎత్తారు. గ్రామ దేవతలకు పవిత్ర జలాలతో జలాభిషేకం చేసి, కొబ్బరికాయలు కొట్టి, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రకృతి అనుగ్రహంతో సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, పంటలు బాగా పండితే రైతుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గ్రామంలో శాంతి, సౌభాగ్యం నెలకొని ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని దేవతలను వేడుకున్నట్లు తెలిపారు..ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలాభిషేకం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.రెండు గ్రామాలలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## విద్యార్థిని యమల మానస మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సంతాపం





**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని జయనగర్ కాలనీకి చెందిన 56వ బూత్ డీఎల్ఓ స్వరూప రాణి, ఖాసిం ని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల అకాల మరణం చెందిన వారి కుమార్తె, విద్యార్థిని యమల మానస మృతి పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ యమల మానస చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా స్వరూప రాణి, ఖాసిం దంపతులను ఓదార్చిన పువ్వాడ అజయ్ కుమార్ మానస ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ తీరని విషాదాన్ని భరించే మనోధైర్యాన్ని ఆ కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.అదేవిధంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశాలతో బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా కొనగంచి వర ప్రసాద్ చేతుల మీదుగా డివిజన్ నాయకులు రూ 20,000 (ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేసి, ఈ క్లిష్ట సమయంలో తాము కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్ జె సి కృష్ణ, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ , మాజీ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, పార్టీ నాయకులు కొనకంచి వరప్రసాద్, కాట్రాల శ్రీరాములు, సద్దాం షేక్, ఆకుల వెంకటేశ్వర్లు , డివిజిజన్ నాయకులు కాట్రాల దినేష్ , పురం వెంకన్న, పొన్నం సుబ్బారావు , ప్రసాద్ , రాజుల రామారావు , వేముల నర్సయ్య, పురం రమేష్ తదితరులు పాల్గొని మానస మృతికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞతను చాటిన త్రివేణి పేరెంట్స్ డే వేడుకలు



**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :** "మాతృదేవో భవ, పితృదేవో భవ" అనే భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని చాటుతూ త్రివేణి టాలెంట్ స్కూల్స్‌లో పేరెంట్స్ డే సెలబ్రేషన్స్–2026ను ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులే ప్రతి బిడ్డకు తొలి గురువులని, వారి ప్రేమ, త్యాగం, మార్గదర్శకత్వమే పిల్లల విజయానికి బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ కుటుంబ విలువలు, సంస్కృతి, క్రమశిక్షణ, నైతికతలను పిల్లల్లో పెంపొందించడంలో తల్లిదండ్రుల పాత్ర అమూల్యమని అన్నారు. పాఠశాల, తల్లిదండ్రుల సమన్వయంతోనే విద్యార్థుల సమగ్ర వికాసం సాధ్యమవుతుందని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు కవితలు, పాటలతో అలరించగా, విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సంప్రదాయబద్ధంగా పాదపూజ నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షతలు వేసి ఆశీర్వదించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ ఆదేశాల మేరకు కిడ్స్ ఇంచార్జ్ స్వప్న విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందన పత్రాలు (సర్టిఫికెట్లు) అందజేశారు. అనంతరం విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి జ్ఞాపకార్థంగా ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమం తల్లిదండ్రులు, విద్యార్థుల మధ్య ఆప్యాయతను మరింత బలోపేతం చేస్తూ భావోద్వేగ వాతావరణంలో సాగింది.ఈ కార్యక్రమంలో సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్‌పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయినీ–ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థినీ–విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## యువ సంగ్రామ సదస్సుకు సంగారెడ్డి నుంచి భారీగా తరలిన విద్యార్థులు, యువజన నాయకులు





**సంగారెడ్డి, జూలై 26, నేటి శుభోదయ :** సదాశివపేట పట్టణంలోని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం లో ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమం మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సౌజన్యంతో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం డాక్టర్ సింధు మాధవనేని వచ్చిన మహిళలకు ఉచిత స్క్రీనింగ్ మరియు వారికి కావలసిన సూచనలు ఇస్తూ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఆరోగ్య కేంద్రానికి కావలసిన వంటశాల మరియు గోదాముల గురించి ఎంపీ నిధుల ద్వారా ఏర్పాటు చేస్తామని అలాగే ఆరోగ్య కేంద్రంలో వైద్యుల వివరాలు తెలుసుకొని విధుల నిర్వహణ వివరాలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల మాణిక్ రావు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోవూరు సంగమేశ్వర్ పట్టణ మాజీ అధ్యక్షుడు కే శ్రీనివాస్ మండల అధ్యక్షులు ఓదెల రాజేశ్వరి కర్ణ ఆదిత్య పట్టణ మండల ప్రధాన కార్యదర్శులు ఉషన్న గారి శ్రీశైలం కావలి అనిత నామ హరీష్ వుక్కిస భరత్ పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు గొర్రిల్ల శివలింగం సీనియర్ నాయకులు తోట చంద్రశేఖర్ శ్రీకాంత్ రాజ్ శ్రీశైలం యాదవ్ గణపురం చంద్రశేఖర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## జగద్గిరిగుట్ట నూతన సీఐ సురేష్‌కు బీజేపీ నాయకుల మర్యాదపూర్వక భేటీ




**కూకట్పల్లి, జూలై 26, నేటి శుభోదయ :** జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన నిగిడాలా సురేష్ ని వెంకటేశ్వర నగర్ ( కూక ట్ప ల్లి) రంగారెడ్డి జిల్లా బీజేపీ యువమోర్చా నాయకుడు హర్ష యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సీఐ సురేష్ ని శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హర్ష యాదవ్ మాట్లాడుతూ, వెంకటేశ్వర నగర్ డివిజన్‌లోని పాపిరెడ్డి నగర్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు అవసరమైన సహకారాన్ని తమవంతుగా ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పాలమూరు ఓబీసీ మోర్చా నాయకుడు భాస్కర్ గౌడ్, సీనియర్ నాయకుడు సుధాకర్, ఆల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షుడు రాజు, డివిజన్ ఉపాధ్యక్షుడు ప్రవీణ్, మహిళా మోర్చా నాయకురాళ్లు అనిత, మునీషా, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## అద్దంకి శివ ని పరామర్శించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :** ఇటీవల గుండె సంబంధిత సమస్యతో శస్త్రచికిత్స చేయించుకున్న ఖమ్మం నగరానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు అద్దంకి శివ ని ఆదివారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆక్షాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఆర్ జేసి కృష్ణ, పగడాల నాగరాజు, బచ్చు విజయ్ కుమార్ తదతరులు ఉన్నారు.

## వైద్య శిబిరం విజయవంతం ఖమ్మం, నేటి శుభోదయ



**ఖమ్మం, జూలై 26,నేటి శుభోదయ** ఖమ్మం నగరంలో గల ఆరవ డివిజన్ కాంగ్రెస్ నాయకులు చంద్ర శశి కుమార్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు చంద్ర రామయ్య ఇందిరా ల 18వ వర్ధంతి సందర్భంగా మెగా హెల్త్ క్యాంపును ఆదివారం నిర్వహించారు. ఈ శిబరాన్ని సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ , ఖమ్మం అర్బన్ డిసిసి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి , ఖమ్మం నియోజకవర్గం సర్ ఇంచార్జ్ కమర్తపు మురళి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య , ఖమ్మం అర్బన్ డిసిసి ప్రధాన కార్యదర్శి కోసూరి.ప్రసాద్, ఖమ్మం అర్బన్ డిసిసి అధికార ప్రతినిధి ఏలూరి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పల్లెబోయిన చంద్రం , జిల్లా మహిళా నాయకురాలు చల్లా. ప్రతిభారెడ్డి, ఆరవ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు యడవల్లి వీరయ్య గౌడ్ లతో కలిసి ప్రారంభించారు. ఖానాపురం 6 వ డివిజన్ లో గల పల్లె దవఖానా ఆవరణలో మొక్కలు నాటారు.

## బోనాల మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :** ఖమ్మం నగరంలోని 48వ డివిజన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించిన బోనాల మహోత్సవంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని, సామాజిక ఐక్యతను పెంపొందిస్తుందని మాజీ మంత్రి పువ్వాడ అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందని, ఈ మహోత్సవం ప్రజల మధ్య సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు. అమ్మవారి ఆశీస్సులతో ఖమ్మం ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని రైతులకు మంచి పంటలు పండాలని, ప్రతి కుటుంబం ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

## వైభవంగా ఉరడమ్మ బోనాల మహోత్సవం





**సంగారెడ్డి , జూలై 26, నేటి శుభోదయ :**
సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన రాయికోడ్ లోని గ్రామ దేవత ఉరడమ్మకు ఆషాఢమాసంను పురస్కరించుకుని ఆదివారం గ్రామస్తులు బోనాల మహోత్సవంను వైభవంగా నిర్వహించడం జరిగింది,ముందుగా గ్రామస్తులు డప్పుచప్పుళ్లతో వాగుకు వెళ్లి గంగమ్మ తల్లికి పూజాకార్యక్రమాలు నిర్వహించి నైవేద్యం పెట్టి ఆ నీటిలో తెప్పేను విడిచి,నిండు కుండలో జలాన్ని తెచ్చి అమ్మవారికి అభిషేకం చేసి,ప్రత్యేక పూజాకార్యక్రమాలు గావించి,ఘటంను సమర్పించారు,అనంతరం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఉరడమ్మ అమ్మవారికి ఒడి బియ్యం పోసి నైవేద్యాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు,తదనంతరం డప్పుచప్పుళ్ల నడుమ శివసత్తుల పునకలు,పోతురాజుల విన్యాసాలు, పిల్లలు,పెద్దలు,యువకుల నృత్యాల నడుమ పురవీధులగుండా ఊరేగింపుగా వచ్చి మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించారు,ఈ సందర్భంగా ఆలయ సన్నిధిలో అన్నప్రసాదా వితరణ గావించారు.

## ప్రతి భవన నిర్మాణ కార్మికుడు లేబర్ కార్డు పొందాలి



**నేరెడ్ మెట్ , జూలై 27 , నేటి శుభోదయ :**
అసంఘటిత రంగంలోని ప్రతి భవన నిర్మాణ కార్మికుడు లేబర్ కార్డు పొందడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందవచ్చనీ సీపీఐ మల్కాజిగిరి మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు అన్నారు. నేరేడ్మెట్ లేబర్ అడ్డా వద్ద ఏఐటీయూసీ మండల కార్యదర్శి జె. వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులచే లేబర్ కార్డుల పునరుద్దరణతో పాటు కొత్త దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా 50 మంది కార్మికులకు లేబర్ కార్డులు అందజేశారు. రాష్ట్ర కార్మిక శాఖలో నమోదు చేసుకోవడం ద్వారా కార్మికులకు అనేక సంక్షేమ ప్రయోజనాలు లభిస్తాయని నాగరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.కె. అజీజ్, జి. వీరమ్మ, పి. స్వాతి, పి. కరుణాకర్, టి. ఆంజనేయులు, ఏ. సందీప్, పి. భాగ్యలక్ష్మి , పి. మహేందర్ తదితరులు పాల్గొన్నారు.ఫొటో రైటప్ 2: ప్రతి ఒక్కరూ లేబర్ కార్డు పొందాలని సూచిస్తున్న కాసార్ల నాగరాజు

## నందిపేట్‌లో పిచ్చి మొక్కల నిర్మూలనకు పురుగు మందుల పిచికారీ చేయించిన గ్రామ పాలకవర్గం



**నిజామాబాద్, జూలై 26, నేటి శుభోదయ :**
గ్రామంలో విచ్చలవిడిగా పెరిగిన పిచ్చి మొక్కల నిర్మూలన కోసం నందిపేట్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక గడ్డి మందు పిచికారీ కార్యక్రమం చేపట్టారు.గ్రామంలోని రోడ్ల వెంబడి,డ్రైనేజీల పరిసర ప్రాంతాల్లో పెరిగిన కలుపు మొక్కలు,పిచ్చి మొక్కలను తొలగించేందుకు పంచాయతీ సిబ్బంది కలుపు నివారణ మందు పిచికారీ చేశారు.6, 7, 8 వార్డుల పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు.పిచ్చి మొక్కల వల్ల దోమల బెడద ఎక్కువై గ్రామస్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నందున,ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ పిచికారీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పాలక వర్గ సభ్యులు తెలిపారు.రాబోయే రోజుల్లో గ్రామంలోని అన్ని వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు సర్పంచ్ సిలిండర్ ఎర్రం లింగం వెల్లడించారు.గ్రామస్తులు సైతం ఈ కార్యక్రమానికి సహకరించి,తమ ఇళ్ల పరిసరాల్లో కూడా పిచ్చి మొక్కలను తొలగించి,చెత్తను ఆటోలో వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చందర్,వార్డు సభ్యులు చింత రవి,షేక్ పాషా,చింత శ్రీనివాస్,కస్తూరి గంగాధర్,నాయకులు ఇమ్రాన్ ఖాన్,సిబ్బంది పాల్గొని పనులను స్వయంగా పర్యవేక్షించారు.

## భద్రాచలంలో తూనికలు—కొలతల శాఖ ఆకస్మిక తనిఖీలు





**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 26, నేటి శుభోదయ :**
భద్రాచలం పట్టణంలోని పలు వ్యాపార సంస్థల్లో తూనికలు—కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా సుమారు పది దుకాణాల్లో తక్కువ కొలతలతో వస్తువులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించినట్లు తూనికలు—కొలతల ఇన్స్పెక్టర్ కె. సుభాష్ తెలిపారు.తనిఖీలలో ఒక పాల కేంద్రం, ఒక మటన్ దుకాణం, ఒక ఐరన్ దుకాణంతో పాటు పలు చికెన్ దుకాణాల్లో తక్కువ కొలతలతో విక్రయాలు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు.ప్రజలకు సరైన తూనికలు, కచ్చితమైన కొలతల తోనే వస్తువులు విక్రయించాలని వ్యాపారులకు ఇన్స్పెక్టర్ కె. సుభాష్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి తక్కువ కొలతలతో విక్రయాలు కొనసాగిస్తే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయడంతో పాటు కోర్టుకు పంపిస్తామని హెచ్చరించారు.

## అర్ధరాత్రి పూట మట్టి తవ్వకాలు -పకృతి గర్భాన్ని కొల్లగొడుతున్న మైనింగ్ మాఫియా

**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :**
ఖమ్మం జిల్లాలోని ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, చింతకాని, బోనకల్, మధిర, ఎర్రుపాలెం, వైరా, కొణిజర్ల, తల్లాడ, కల్లూరు తదితర మండలాల్లో పరిధిలో రాత్రిళ్లు పకృతి సంపద ను చీల్చేస్తూ జరిగే తవ్వకాలు ప్రభుత్వ ఆదాయానికి గండికొక్కుతున్నాయి. మైనింగ్ మాఫియా దెబ్బకు ప్రభుత్వ ఖజానాకు ఒక్క రూపాయి ఆదాయం చేరకుండా, లక్షలాది రూపాయల మట్టి రహస్యంగా అమ్ముడవుతోంది.--- అర్ధరాత్రి తవ్వకాలు, నిబంధనలకు కళ్లెం లేదు రాత్రి 12 గంటల నుంచే ప్రారంభమయ్యే మట్టి తవ్వకాలు తెల్లవారుజాము వరకు సాగుతున్నాయి. లారీలు, ట్రాక్టర్లు గుండా వెళ్లినా పట్టించుకునే అధికారి లేరు. వాటిని ఆపాలంటే అధికారులకే భయం, బలహీనతే ప్రధాన కారణం అని చెప్పక తప్పదు. ఖమ్మం జిల్లాలో "దశల వారీగా మైనింగ్ చేస్తున్నాం" అనే మాఫియా మాటలు పర్యావరణ నిబంధనలకు వ్యతిరేకంగా వినిపించడం శోచనీయం. ఈ మట్టి వాహనాలు దొంగ దారిలో పలు మార్గాల్లో ట్రిప్పర్లు వెళ్లుతున్నా వాటిని ఆపలేని వేగంతో దూసుకెళ్తున్నాయి.పోలీసులు, తహసీల్దార్లు చూడకుండా ఉండాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోంది.--- అధికార యంత్రాంగం చేతులెత్తేసింది"ఇది కామన్ మైనింగ్ కదా, అన్నట్లు వ్యవహరిస్తున్న పోలీసుల వ్యవహారం ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారాయి. తహసీల్దార్ కార్యాలయం, ప్రజల ఫిర్యాదులకు స్పందించని స్తితి చోటు చేసుకుంది. ఆర్ టిఐ ప్రకారం గత మూడు నెలల్లో నోటీసులు జారీ చేసిన సంఖ్య శూన్యం అని తెలుస్తుంది. రెవెన్యూ,పోలీస్ శాఖల మధ్య అవగాహనతో తవ్వకాలకు అడ్డుకట్ట పడుతోందా లేదా సహకారం ఉందా? అన్న అనుమానాలు ముదిరిపోతున్నాయి.--- ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో నష్టం ప్రతి రోజూ కనీసం 180–300 ట్రిప్పర్లు అయా ప్రాంతాల నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం.ఒక్క ట్రిప్‌కు ప్రభుత్వ ఆదాయంగా రావాల్సింది రూపాయలు అయితే ప్రస్తుతం అది నేరుగా మాఫియాకు వెళ్తుంది. అర్థం చేసుకోవచ్చు. రోజుకు కనీసం రూ 8 లక్షలు నష్టమంటే నెలకి రూ 2 కోట్లు పైగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. --- ప్రభుత్వ ఆశయాలకు తూట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో పరిశ్రమలు, పెట్టుబడులు, ఆదాయ వనరులు పెంచాలన్న దృఢ సంకల్పానికి, అధికారుల నిర్లక్ష్యంతో జరిగిన ఈ అక్రమ తవ్వకాలు ఝలక్ ఇస్తున్నాయి. ఒకవైపు ముఖ్యమంత్రి ఢిల్లీ, విదేశాలకు వెళ్లి పెట్టుబడులు రాబడుతుంటే, మరోవైపు అధికారులు భూమి గర్భాన్నే అమ్మేస్తుంటే అది పరిపాలనా పరాభవమే. జిల్లా స్థాయిలో హై-లెవెల్ కమిటీ ఏర్పాటు చేసి అక్రమ మైనింగ్ పై సర్వే నిర్వహించాలి. అయా ప్రాంతాల ట్రాకింగ్ – డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి. నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై సస్పెన్షన్, ఎసిబి విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రజలకు అప్రమత్తత కోసం స్థానికంగా మైనింగ్ అవగాహన క్యాంపులు నిర్వహించాలి. ఇది ఒక ఖమ్మం పరిసర ప్రాంత సమస్య కాదు. ఇది ప్రజల హక్కులకు, ప్రభుత్వ నైతికతకు, రాష్ట్ర అభివృద్ధి ఆశయాలకు గుండెమీద దెబ్బ.ఈ విషయంలో ప్రజల మౌనం మాఫియాకు మద్దతుగా మారకూడదు. ప్రభుత్వ యంత్రాంగం నిద్రలేచి, ప్రజాస్వామ్య శక్తిగా స్పందించాలి. నేడు స్పందించని అధికారుల మౌనం. రేపు మరొక శాఖకు శాపంగా మారకూడదు.

## కార్గిల్ విజయం ప్రతి భారతీయుడికి గర్వకారణం

**నిజామాబాద్ , జూలై 26, నేటి శుభోదయ :**
కార్గిల్ విజయం ప్రతి భారతీయుడికి గర్వకారణం అని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు.కార్గిల్ విజయ్ దివస్ ను పురస్కరించుకొని ఆదివారం నగరంలోని ఎల్లమ్మ గుట్ట చౌరస్తాలో గల అమరవీరుల స్తూపానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....1999లో కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం అసమాన ధైర్యసహసాలను ప్రదర్శించి,శత్రువులను తరిమి కొట్టి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిందన్నారు.సుమారు 500 మంది సైనికులు తమ ప్రాణాలను అర్పించారని వారందరి త్యాగ ఫలితంతో స్వేచ్ఛగా ఉండగలుగుతున్నామన్నారు.వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు.బీజేపీ ఎప్పటికీ దేశభద్రత సైనికుల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యమిస్తుందన్నారు.దేశ ప్రధాని మోదీ నేతృత్వంలో భారత రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు.అమర జవాన్ల త్యాగాన్ని స్మరించుకుంటూ దేశ సమైక్యతను సార్వభౌమత్యాన్ని కాపాడేందుకు అంకితభావంతో పనిచేద్దామని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి,జిల్లా ప్రధాన కార్యదర్శి,19వ



డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ,మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత,యువ మోర్చా అధ్యక్షులు వంశీ,కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్,మఠం పవన్,జ్యోతి మురళి,సుమిత్ర కిషోర్,ప్రసూన శ్రీనివాస్,మమత శివ,రాష్ట్ర కో కోశాధికారి విజయ్,సీనియర్ నాయకులు స్వామి యాదవ్ భూపతి తదితరులు పాల్గొన్నారు..

## ముక్కిడి చెరువు మునిగింది... సుందరీకరణే మిగిలిందిఏడేళ్లుగా అసంపూర్తి పనులు





**నేరెడ్ మెట్, జూలై 26, నేటి శుభోదయ :**
భఒకప్పుడు పరిసర ప్రాంతాలకు భూగర్భ జలాల ప్రధాన ఆధారంగా నిలిచిన రామకృష్ణాపురం (ముక్కిడి) చెరువు నేడు మురుగు నీటి నిల్వగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. చెరువు పునరుద్ధరణ పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ అసలు లక్ష్యం నెరవేరకపోవడంతో చెరువు సుందరీకరణ హీనంగా మారిందని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ బాధను ఓ కాలనీ వాసి సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకోవడంతో మరోసారి ఈ సమస్య చర్చనీయాంశంగా మారింది.మిషన్ కాకతీయ కింద సుమారు రూ.11 కోట్లతో చేపట్టిన చెరువు పునరుద్ధరణ పనులు ఏడేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రారంభంలో చెరువులోని నీటిని పూర్తిగా తొలగించినప్పటి నుంచి నేటి వరకు పూడిక తొలగింపు, వర్షపు నీటి ప్రవాహ మార్గాల ఏర్పాటు, మురుగు నీటి మళ్లింపు వంటి కీలక పనులు పూర్తికాలేదని పేర్కొంటున్నారు. ఫలితంగా ప్రస్తుతం చెరువులోకి చేరేది వర్షపు నీరు కాదు.. కాలనీల నుంచి వచ్చే మురుగు నీరే కావడంతో మొత్తం చెరువు దుర్వాసన వెదజల్లే మురుగు కుంటగా మారిందని వాపోతున్నారు.చెరువు చుట్టూ నడక మార్గం ఏర్పాటు చేసినప్పటికీ సరిపడా విద్యుత్ దీపాలు లేకపోవడంతో సాయంత్రం తర్వాత చీకట్లోనే వాకింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మురుగు నీటి దుర్వాసనతో వాకింగ్‌కు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. సుందరీకరణ పేరుతో చేపట్టిన పనులు ప్రజలకు ఉపయోగపడేలా లేకపోవడంతో ప్రజాధనం వృథా అయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.చెరువు నీటి నిల్వ సామర్థ్యం కోల్పోవడంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం గణనీయంగా పడిపోయిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు తక్కువ లోతులో లభించే నీటి కోసం ఇప్పుడు వందల అడుగుల లోతుకు బోర్లు వేయాల్సి వస్తోందని చెబుతున్నారు. దాదాపు 15 కాలనీలకు చెందిన వేలాది కుటుంబాలు ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొంటున్నారు.స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్లు చెరువు అభివృద్ధిని తూతూ మంత్రంగా నిర్వహించి మధ్యలోనే వదిలేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మురుగు నీటి ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేసి, పెండింగ్ పనులు పూర్తి చేసి, వర్షపు నీటి ప్రవాహ మార్గాలను పునరుద్ధరించి, చెరువును సహజ స్వరూపంలోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే పర్యావరణ పరిరక్షణతో పాటు భూగర్భ జలాల సంక్షోభం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.ఫొటో రైటప్ 3,4: సుందరీ కారణకు నోచుకోని రామకృష్ణాపురం చెరువు ... విద్యుత్ దీపాలు లేక చీకటిలోనే వాకింగ్ చేస్తున్న స్థానిక ప్రజలు

## ఒత్తిడి పెరుగుతున్న వేళ.. సైకాలజిస్టులదే కీలక బాధ్యత

**నేరెడ్ మెట్ , జూలై 26, నేటి శుభోదయ :** మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న ఒత్తిళ్లు, ఆందోళనల నేపథ్యంలో సమాజ మానసిక ఆరోగ్య పరిరక్షణలో సైకాలజిస్టుల పాత్ర అత్యంత కీలకమని తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. మోతుకూరి రాంచందర్ అన్నారు. నేరేడ్మెట్‌లోని హెలెన్ కెల్లర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన భారతీయ మనస్తత్వ శాస్త్ర దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.మానసిక ప్రశాంతతను కాపాడుకోవడానికి యోగ, ధ్యానం, భారతీయ మనస్తత్వ శాస్త్రం వంటి సంప్రదాయ విధానాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గురుపౌర్ణిమ సందర్భంగా మహర్షి వేదవ్యాసుని స్మరించుకోవడం భారతీయ సంస్కృతిలో విశిష్ట సంప్రదాయమని పేర్కొన్నారు. కాలానుగుణంగా సైకాలజిస్టులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతికతను కౌన్సెలింగ్ సేవల్లో వినియోగించి ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు.తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ గత తొమ్మిదేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ సేవల విస్తరణకు కృషి చేస్తోందన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు డా. ఉమర్ ఖాన్ మాట్లాడుతూ, మానసికంగా దృఢమైన పౌరులే సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా



సంఘం వార్షిక కార్యాచరణ ప్రణాళికను విడుదల చేయడంతో పాటు సైకాలజీ రంగంలో విశిష్ట సేవలందించిన పలువురు సైకాలజిస్టులను సన్మానించారు.కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు ఏ. సుధాకర్, రాష్ట్ర కోశాధికారి డా. శ్రీపూజ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు శ్రీదేవి చెరువు, వైదేహి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజు ఆచార్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం. కృష్ణ సాహితి, నాయకులు శ్రీధర్, సునయన, సోనాలి, కిరణ్మయి, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.ఫొటో రైటప్ 1 : భారతీయ మనస్తత్వ శాస్త్ర దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. మోతుకూరి రాంచందర్ తదితరులు

## గిరి ప్రదక్షిణపై కులవివక్ష ఆరోపణలు.. భక్తుల్లో ఆందోళన

**వికారాబాద్ , జూలై 26, నేటి శుభోదయ :** పాంబండ రామలింగేశ్వర స్వామి గిరి ప్రదక్షిణలో కులవివక్ష జరుగుతోందంటూ భక్తుల ఆరోపణలు.అగ్రకులాల వారు పూర్తిచేసిన తర్వాతే ఇతరులు గిరి ప్రదక్షిణ చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన.దేవాలయ ప్రాంగణంలో అందరికీ సమాన హక్కులు కల్పించాలని భక్తుల విజ్ఞప్తి.దక్షిణ భారతదేశంలో ఏకశిలా పర్వతంగా ప్రసిద్ధి చెందిన పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రతి పౌర్ణమి సందర్భంగా నిర్వహించే గిరి ప్రదక్షిణపై కులవివక్ష ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్వామివారి దర్శనం కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తమకు అనుకూలమైన సమయంలో గిరి ప్రదక్షిణ నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అయితే ఇటీవల కొందరు భక్తులు తమకు ఎదురైన అనుభవాలను వెల్లడిస్తూ దేవాలయ పరిసరాల్లో వివక్షకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.భక్తుల కథనం ప్రకారం, కొందరు వ్యక్తులు అగ్రకులాలకు చెందిన వారు గిరి ప్రదక్షిణ పూర్తి చేసిన తర్వాతే ఇతరులు ప్రదక్షిణ చేయాలని ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా కొంతమంది భక్తులు ఉదయం సమయంలో గిరి ప్రదక్షిణ నిర్వహించగా, తమ అనుమతి లేకుండా ఎలా నిర్వహించారని ప్రశ్నిస్తూ వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. దీంతో అణగారిన వర్గాలకు చెందిన భక్తుల్లో భయాందోళనలు నెలకొన్నాయని పేర్కొంటున్నారు.కొంతమంది భక్తులు తమను బెదిరిస్తూ, అధికార పార్టీ అండ ఉందని చెప్పి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కూడా ఆరోపిస్తున్నారు. దేవాలయానికి వచ్చే ప్రతి భక్తికి సమాన హక్కులు ఉండాలని, కులం పేరుతో ఎలాంటి వివక్షకు తావు ఉండకూడదని వారు కోరుతున్నారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించిన నేపథ్యంలో, దేవాలయాల్లో కూడా ఎలాంటి కులవివక్షకు అవకాశం ఉండకూడదని భక్తులు అభిప్రాయపడుతున్నారు. గిరి ప్రదక్షిణలో అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా దేవస్థాన అధికారులు,



శుభోదయ

### దేవుని వార్త రాయడమే తప్పా..?

విలేఖరిపై ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆగ్రహం.. అగ్ర కుల అహంకారమా?



సంబంధిత యంత్రాంగం జోక్యం చేసుకుని వాస్తవాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## చాపలకేరి శ్రీ మహంకాళి అమ్మవారి 30వ బ్రహ్మోత్సవాలు - బోనాల జాతరకు

### పులిమామిడి రాజును ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు

**సదాశివపేట, జూలై 26, నేటి శుభోదయ :**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని చాపలకేరి శ్రీ మహంకాళి మందిరంలో ఈ నెల 31 నుంచి ఆగస్టు 3వ తేది వరకు నిర్వహించనున్న 30వ బ్రహ్మోత్సవాలు మరియు బోనాల జాతరకు సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజును ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జాతర ఆహ్వాన పత్రికను అందజేసి, ఉత్సవాలకు విచ్చేసి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా జూలై 31 శుక్రవారం ఉదయం 10:00 గంటలకు కలశాల ఊరేగింపు, ప్రత్యేక అభిషేకాలు, అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఆగస్టు 1 శనివారం రాత్రి 9:00 గంటలకు తెలంగాణ సాంప్రదాయ భజన కార్యక్రమం నిర్వహించనున్నారు.ఆగస్టు 2 ఆదివారం శ్రీ మహంకాళి అమ్మవారి ★బోనాల పండుగ (జాతర)★ను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకోనున్నారు.ఆగస్టు 3 సోమవారం అమ్మవారి బ్రహ్మోత్సవాలు, గిరి ప్రదక్షిణ, కంకణ విసర్జన, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగియనున్నాయి.ఈ నాలుగు రోజులపాటు జరిగే ఆధ్యాత్మిక వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో



పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని శ్రీ మహంకాళి మందిరం ఆలయ కమిటీ మరియు భక్త బృందం విజ్ఞప్తి చేసింది. ఇట్టి కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నల్ల సుధాకర్, ప్రధాన కార్యదర్శి నల్ల శంకర్, చాపల హన్మంతు, బంటు రవి, కప్పల రాము మరియు పి. ఎం. ఆర్ యువసేన నాయకులు రాగం అనిల్, గుణాకర్, తాలెల్మ రాము, ఆనంద్ (చిన్న ), తాలెల్మ రాము, సోమ శంకర్, అఖిల్ మొదలగు వారు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లోకి యువత భారీ చేరికలు - ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో

### గులాబీ కండువా కప్పుకున్న పలువురు యువకులు

**మల్కాజిగిరి , జూలై 26, నేటి శుభోదయ :** మల్కాజిగిరి నియోజకవర్గంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీలోకి పలుచోట్ల నుంచి యువత భారీ సంఖ్యలో చేరింది. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు.భారతీయ జనతా పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యువమోర్చా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు జక్కుల కిరణ్ ముదిరాజ్, కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో యువత సైనిక్‌పురి చౌరస్తా నుంచి కాకతీయనగర్‌లోని నాగలక్ష్మి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీగా చేరుకుని బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.నేరేడ్మెట్ డివిజన్‌లోని రేణుకనగర్ కమ్యూనిటీ హాల్‌లో సుమన్ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరగా, వెంకటాపురం డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్, కానాజిగూడ ప్రాంతాల నుంచి శ్రీధర్ గౌడ్, సురేష్, కన్నా, సుదర్శన్ ఆధ్వర్యంలో పలువురు యువకులు ఎమ్మెల్యే



క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని అన్నారు. యువత విశ్వాసంతో పార్టీలో చేరడం సంతోషకరమని, వారి భాగస్వామ్యంతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, జేఏసీ వెంకన్న, జీకే హనుమంతరావు, మేకల రాము యాదవ్, చంద్రమౌళి, సురేష్, శ్రీనివాస్



రెడ్డి, శేఖర్ గౌడ్, శివ గౌడ్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, పంజా శ్రీకాంత్ యాదవ్, సర్వేష్, కృష్ణమూర్తి, హేమంత్ పటేల్, ఫరీద్, బంటి, అరుణ్, శివ, బాలకృష్ణ, శ్రీనివాస్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల జేఏసీ చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి



**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :**
తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నూతన చైర్మన్‌గా తిరుమలాయ పాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది గుండా కరుణాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మం కస్బాబజార్‌లోని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) కార్యాలయంలో ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఎంపీజే జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసీం అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల హక్కుల పరిరక్షణకు ఉద్యమకారులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కొందరు స్థానికేతర వ్యాపారులు పన్నుల ఎగవేతకు పాల్పడుతున్నారని, దీనివల్ల తెలంగాణ రాష్ట్ర ఖజానాతో పాటు ప్రజల ప్రయోజనాలకు భారీ నష్టం వాటిల్లుతోందని తెలిపినారు. ఇటువంటి అంశాలపై సంబంధిత యంత్రాంగం దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది, ఎంపీజే వ్యవస్థాపకుడు హైదర్ అలీ, ప్రధాన కార్యదర్శి నాసర్, సతీష్, కోశాధికారి అబ్దుల్ హకీమ్, జిల్లా నాయకులు రఫీ, రజ్జబ్ అలీ, అహ్మద్, సేవా బ్యాంకు మేనేజర్ రఫీ, రజాక్, తెలంగాణ ఉద్యమకారులు ఆసిఫ్, బురహాన్ తదితరులు పాల్గొన్నారు.

## వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో విజయవంతంగా ఆధ్యాత్మిక యాత్ర





**సంగారెడ్డి, జూలై 26, నేటి శుభోదయ :**
వీరశైవ సమాజం ఆధ్వర్యంలో ఘనంగా విహారయాత్రసంగారెడ్డి జిల్లా వీరశైవ సమాజం ఆధ్వర్యంలో సమాజ సభ్యులు ఆధ్యాత్మిక, విహారయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ యాత్రలో భాగంగా ముందుగా శ్రీరంగాపురంలోని ప్రసిద్ధ శ్రీ రంగనాథ స్వామి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం సింగపట్నంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, సోమశిలలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం, బిచ్చపల్లిలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలను సందర్శించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం అలంపూర్‌లోని శ్రీ జోగులాంబ అమ్మవారి శక్తి పీఠాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. యాత్ర సందర్భంగా అక్కడి ఆధ్యాత్మిక వాతావరణంతో పాటు ప్రకృతి అందాలను సభ్యులు ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు.ఈ విహారయాత్రలో సంగారెడ్డి జిల్లా వీరశైవ సమాజం జిల్లా యువత అధ్యక్షుడు బుగ్గనగారి మల్లికార్జున్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్, యువత కార్యనిర్వాహక అధ్యక్షుడు పట్లోల ప్రశాంత్ పాటిల్, సదాశివపేట వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు గాంధీగా రాజు, గౌరవ సలహాదారు అనిమిశెట్టి జయప్రకాశ్, అవంచ్ సుధాకర్, పోచారం అశోక్, దేశెట్టి చంద్రశేఖర్, ప్రశాంత్ స్వామి, అభి,రాష్ట్ర నాయకులు పాసారం శ్రీనివాస్, రిటైర్డ్ ఎమ్మార్వో జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, బసవరాజు,ఈశ్వరయ్య స్వామి ,అడ్వకేట్ వీర మహేందర్, ఓంకార్ స్వామి రచ్చయ్య స్వామి చెన్న బసవయ్య నీలకంఠం పాసారం శ్రీనివాస్ జగదీశ్వర్, ప్రశాంత్, నాగరాజుపాటు పలువురు వీరశైవ సమాజ సభ్యులు పాల్గొన్నారు.ఈ యాత్ర సభ్యుల మధ్య ఐక్యతను, స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించిందని నిర్వాహకులు తెలిపారు.

## వాసిరెడ్డి వెంకటేశ్వరరావును పరామర్శించిన కమ్మ సంఘం నాయకులు



**ఏన్కూర్, జూలై 26, నేటి శుభోదయ :**
బిఆర్ఎస్ పార్టీ నాయకులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు ను కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో కమ్మ సంఘం నాయకులు పరామర్శించారు. వాసిరెడ్డి వెంకటేశ్వరరావు గత వారం రోజుల క్రితం బైక్ పై వస్తుండగా అకస్మాత్తుగా ప్రమాదం జరిగింది. దీంతోకాలుకు గాయం కావడంతో చికిత్స తీసుకుంటూ ఇంట్లోనే ఉంటున్న సంగతి తెలిసిందే.విషయం తెలుసుకున్న కమ్మ సంఘం నాయకులు ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాదినేని అశోక్, వేముల రమేష్, డాక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## టి మీడియా గోరింటాకు పండుగకు అపూర్వ ఆదరణ



**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :**
తెలుగు డిజిటల్ మీడియా రంగంలో అగ్రగామిగా నిలుస్తున్న టి మీడియా (తెలుగు డిజిటల్) ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న ఎస్‌డబ్ల్యూఎఫ్ (సీఐటీయూ) కార్యాలయంలో నిర్వహించిన గోరింటాకు పండుగకు అపూర్వ ఆదరణ లభించింది.ఆటపాటలతో పాల్గొన్న యువతులు కార్యక్రమంలో ఉత్సాహంగా సందడి చేశారు. పాల్గొన్న వారి నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయలేదు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.టి మీడియా ఎండీ శివరాజు శ్రీరామ్, న్యూస్ అండ్ వెబ్ ఇన్‌చార్జ్ పాపినేని అనంత లక్ష్మి నాయకత్వంలో లహరి, తపస్వి, అపర్ణ తదితరులు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. టి మీడియా మార్కెటింగ్ మేనేజర్ ఆలవాల నవీన్, జ్యోతి బోటిక్ అధినేత జ్యోతి సహకారం అందించారు.వాణీ హాస్టల్ విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటూ మహిళలు ఆప్యాయతను పంచుకున్నారు. పరస్పరం పరిచయం లేని వారంతా ఒకే వేదికపై కలుసుకొని మహిళా ఐక్యతను చాటారు.--- ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులకు అభినందనలుటి మీడియా గోరింటాకు పండుగ నిర్వహణ కోసం కోరగానే తమ కార్యాలయంతో పాటు మైక్, కుర్చీలను అందించిన టీజీ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రీజియన్, డివిజన్ నాయకత్వానికి టి మీడియా చైర్మన్ శనగపాటి మురళీ కృష్ణ అభినందనలు తెలిపారు.ప్రజాపక్షంలో నిలిచే టి మీడియాకు కార్మిక సంఘం అందించిన సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సహకారంతో మరింత బాధ్యతాయుతంగా, నిజమైన జర్నలిజాన్ని ప్రజలకు అందించగలమనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి ఎమ్మెల్యే మర్రి పరామర్శ



**మల్కాజిగిరి, జూలై 26, నేటి శుభోదయ :**
నియోజకవర్గంలోని వినాయక్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త లావణ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల లావణ్య భర్త చేకొండ నరేష్ మృతిచెందిన నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఓదారుస్తూ, ఈ క్లిష్ట సమయంలో పార్టీతో పాటు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## మన సమాజం లేకుండా మనంలేం - హాస్టల్ కతలు పుస్తకావిష్కరణ లో కవి, కథకులు విశ్రాంత ఐ.ఏ.స్ ఆఫీసర్ అంగలకుర్తి విద్యాసాగర్




**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :**
మన సమాజాన్ని పట్టించుకోకుండా బతకలేమని వ్యవస్థల్ని మార్చడానికి ఎవరో ఒకరు నిబద్ధత తో తమ పని తాము చేయడమే కోమాకుల సీతారాములు రాసిన హాస్టల్ కతల సారాంశమని కవి, రచయిత విశ్రాంత ఐఏఎస్ అధికారి అంగలకుర్తి విద్యాసాగర్ అన్నారు. ఆదివారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో బహుజన సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కవి , విమర్శకులు, కాళోజీ అవార్డు గ్రహీత డా.సీతారాం అధ్యక్షతన కథకుడు విశ్రాంత హాస్టల్ వార్డెన్ కోమాకుల సీతారాములు రాసిన హాస్టల్ కతలు పుస్తకావిష్కరణలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సినది మన మూలాల్ని మరిచిపోకపోవడమేనన్నారు.హాస్టల్ కతలు లో యదార్థ సంఘటనల అనుభవాన్ని సీతారాములు రాశారని తెలిపారు.విశిష్ట అతిథిగా పాల్గొన్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ భాంగ్రా భూక్యా మాట్లాడుతూ తనజీవితంలో జరిగిన హాస్టల్ సంఘటనలే హాస్టల్ కతలలో కనిపిస్తున్నాయని అన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కవి విమర్శకులు కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు మాట్లాడుతూ ముప్పై ఏళ్ల క్రితం వెలువడిన హాస్టల్ కతలు ఇంకా వాటి ప్రాసంగిత ఉండటం వ్యవస్థ లో రావాల్సిన మార్పు వచ్చిందా లేదా అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాలని సూచించారు.గౌరవ అతిథిగా పాల్గొన్న టీజిఓ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీతారాములు లో నిబద్ధత నిజాయితీ ప్రశ్నించే తత్వం ఉన్న వార్డెన్ కావడం వలన ఇటువంటి కథలు రాశారు న్నారు.అనంతరం సీతారాములు శిష్యుడు ప్రముఖ సినీ గేయ రచయిత,సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియోని ఘనంగా సన్మానించారు.స్పందనగాఆయన మాట్లాడుతూ తనకు తెలుగు భాష ను నేర్పిన గురువు, ఈ స్థాయిలో ఉండటానికి హాస్టల్ వార్డెన్ గా తనలాంటి ఎందరో గిరిజన విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపిన అక్షర యోధుడని కొనియాడారు.ఖమ్మంజిల్లాఅంబేద్కర్, సోక్రటీస్, డార్విన్ గా తన గురువు నిలిచారని ప్రశంసించారు.ఘనంగా భీమ్స్ ని కవులు రచయితలు కళాకారులు సన్మానించారు. తన గానంతో సభను రంజింపచేశారు. ఆయన తల్లి తండ్రి ని సత్కరించారు.పుస్తకాన్ని కవి, కథకులు రాచమల్ల ఉపేందర్ సమీక్ష చేస్తూ సత్యం కోసం పోరాటం చేసిన యోధుడిగా అభివర్ణించారు చివరగా రచయిత దంపతులను ఘనంగా సత్కరించారు.తొలుత గాయకులు పాడిన పాటలు శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో లెనిన్ శ్రీనివాస్,పంజాల అయిలయ్య,కటుకోజ్వలరమేష్ ,కె.రామారావు, అరుణకుమారి వెంకటేశ్వరరావు ఖుర్షీద్ ,జి.శ్రీనివాసరావు,మొగిలి, లింగాల రవికుమార్,కొమిరె వెంకన్న,జి.వీరన్న కార్డియాలజిస్ట్ సీతారాం సుబ్బారావు , పిచ్చి రెడ్డి నాగేశ్వరరావు మల్లేశం గోపాల రావు ,యం సుబ్బయ్యతదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గవర్నమెంట్ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టిజిసి జిటిఏ) ఖమ్మం జిల్లా సురేందర్ రెడ్డి ప్యానెల్ ఏకగ్రీవ ఎన్నిక





**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :**
తెలంగాణ గవర్నమెంట్ కళాశాల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (టిజిసిజిటిఏ) ఖమ్మం జిల్లా ఎన్నికలు స్థానిక ఎస్ ఆర్ అండ్ బిజిఎన్ఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. ఎన్నికలలో డా కే సురేందర్ రెడ్డి ప్యానెల్ తరుపున అధ్యక్షులు డా. పి విజయ్ కుమార్, కార్యదర్శి సూరంపల్లి రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. కోశాధికారి డా. ఎస్ శ్యామలాదేవి, ఉపాధ్యక్షులుగా డా. కుక్కల కార్తీక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ గోపి, మాజీ జిల్లా అధ్యక్షులు డా. ఎన్ మాధవరావు హాజరైనారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డా. ఎన్ గోపి మాట్లాడుతూ డా. కే సురేందర్ రెడ్డి నాయకత్వంలో కళాశాల అధ్యాపకుల సమస్యలు పరిష్కారం అయ్యాయని ప్రభుత్వ సహకారంతో జీవో నెంబర్ 21 ద్వారా జూనియర్ కళాశాల సర్వీస్ ను పరిగణలోకి తీసుకొని కెరియర్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ కి లబ్ధి పొందేలా సురేందర్ రెడ్డి కృషి చేశారని, క్యాడర్ కు సంబంధించిన అనేక అంశాల పరిష్కారానికి కృషి చేసిన ఈ నాయకత్వాన్ని ఎన్నుకోవటం అభినందనీయమని తెలియజేశారు. డా. ఎన్ మాధవరావు మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గం అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వంతో కలిసి పని చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఆగస్టు 2వ తారీఖు జరిగే రాష్ట్ర ఎన్నికలలో సురేందర్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ ఏకాభిప్రాయంగా తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా డి రమేష్ వ్యవహరించారు, ఈ కార్యక్రమంలో డా. కే కిరణ్ కుమార్, డా. పానుగోటి రవికుమార్, డా. వి బ్రహ్మం, డా. బూరుగు శ్రీనివాస్, డా. డి సుజాత, డా. ఐ కిరణ్ కుమార్, పి శ్రీనివాస్, డా. ఎస్ బాబు, డా. పూర్ణచందర్రావు, డా. శ్యాం ప్రసాద్, డా. శ్రీనివాస్ కుమార్, సిహెచ్ మల్లేశం, డా డి అరుణ, డా . శ్రీరామ్ రాకేష్, కే. రవికుమార్, డా. సిహెచ్ శ్రీనివాస్, డా. గంటయ్య గుప్తా, డా. సర్వేశ్వరరావు, సుజిత్ రెడ్డి, బి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు కొన్ని అంతస్తులకి అదనపు అంతస్తుల భవనాలు లెక్క లేనన్ని




**శేరిలింగంపల్లి, శేరిలింగంపల్లి , నేటి శుభోదయ :**
శేరిలింగంపల్లి 49 సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అనుమతికి మించి అదనపు అంతస్తులు నిర్మిస్తున్న వారు ఇచ్చే ముడుపులు తీసుకొని చేతులు దులుపు
కున్న టౌన్ ప్లానింగ్ అధికారులు. ఇక ఇది తమ పని కాదు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇలాంటివి శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోనీ రాఘవేంద్ర కాలని, రాజరాజేశ్వరి కాలని, శ్రీరామ్ నగర్ ఏ.బి.సి బ్లాకులు, గచ్చిబౌలి, అంజయ్య నగర్, రోలింగ్ హిల్స్ ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని ప్రాంతాల్లో.అక్రమ నిర్మాణాల దారులకు అండగా నిలుస్తున్న అధికారుల పై నిఘా ఉండాలని ప్రజలు అంటున్నారు. ఇలాంటి అడ్డదారిలో డబ్బులకు కక్కుర్తి పడి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా సహకరిస్తున్న వారిపై [illegible]

గుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.తాజా మాజీ కార్పొరేటర్ బంధువు, మరికొందరు అనుచరులు అక్రమంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టినా చర్యలు ఉండవు.ఎందుకంటే మా వెనకాల ప్రజాప్రతినిధి ఉన్నాడనే భరోసా నో లేక అధికారులు ఏమి చేయ లేరు అనే ధీమా తెలియదు కానీ అక్రమ నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు. మమ్మేమ్లెవరు ఆపేది..ఏది చేసినా ? ఎంత చేసినా మమ్మేమ్లెవరురా ఆపేది అంటూ ఓ సినిమా పాటను తలపించే విధంగా శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఎన్నో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పిర్యాదులు చేసిన ఏ ఒక్క అధికారి పట్టించుకోకపోవడంలో ఎన్ని లక్షలరూపాయలు చేతులు మారుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. స్పెషల్ టాస్క్ ఫోర్స్ టీమ్ లను ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణాలు నేలమట్టం చేస్తే తప్పా వీరికి అడ్డుకట్ట వేయలేరని సాధారణ ప్రజలు పేర్కొంటున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం లో కింది స్థాయి సిబ్బంది బిల్డర్ లకి లోపల పనులు లేట్ గా చేసుకున్న బయట ప్లాస్టింగ్ పనులు చేసుకుని సున్నలేసుకొండనీ సలహాలు ఇవ్వడం గమనార్హం..అన్ని ఆటంకాలే .... కాలనీల్లో మౌళిక వసతులు అంటే రోడ్లు, డ్రైనేజీ, త్రాగు నీరు పైపులైన్ లు వేయడం కోసం అక్కడ నివసిస్తున్న ప్రజలను అంచనా వేసి పైప్ లైన్లు వేస్తారు. కానీ ఇలా అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టడం వల్ల జనాలు పెరిగిపోవడం తో వేసిన డ్రైనేజీ, త్రాగు నీరు సరిపోవడం లేదు. నిర్మాణ సామాగ్రి ఇసుక, కంకర, సిమెంట్ తీసుకువచ్చిన భారీ వాహనాల వల్ల రోడ్లు పడవుతున్నాయి. దీంతో ప్రజలు ట్రాఫిక్ జామ్ వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ నిత్యం పొంగి పొర్లి తీవ్ర దుర్గంధం వల్ల ప్రజలకి అసౌకర్యంగాను , అనారోగ్యం కి కూడా గురవుతున్నారు.ఇప్పటికైనా అధికారులు చర్యల కి ఉపక్రమించపోతే ఫిర్యాదు దారులు పై అధికారుల దృష్టి కి తీసుకెల తాము అని తెలిపారు.

# ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత..
## వి. జగదీశ్వర్ గౌడ్





**శేరిలింగంపల్లి , జూలై 26, నేటి శుభోదయ :** "ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ ఓటును పరిరక్షించుకోవాలి" అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు.శనివారం మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎంఏ నగర్, స్టాలిన్ నగర్, ప్రశాంత్ నగర్ బస్తీలలో బీఎల్ఓలు, బీఎల్ఏలు, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త, ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడానికి సహకరించాలని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమని పేర్కొన్నారు. ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో దొర్నాల రవికుమార్ గౌడ్, మన్నేపల్లి సాంబ శివరావు, యలమంచి ఉదయ్ కిరణ్, నడి మింటి కృష్ణ, రాచ మల్ల భాస్కర్ గౌడ్, రవీందర్ రెడ్డి, కె. రాంబాబు, సి. సురేష్, నవీన్ నేత, శ్రీకాంత్ రాయికోటి, రాజారెడ్డి, బి. శ్రీకాంత్, సత్యరాజ్, రాఘవేంద్ర, నరసింహ, మల్లేష్, పాండు, ప్రశాంత్, భరత్, వాసు, హీరా వర్ధన్, ఓంకార్ , జి హెచ్ ఎం సి సూపర్వైజర్ రమేష్ కుమార్, బండి రామకృష్ణ గౌడ్,పుష్ప, కావేరి, సుజాత, పావని, అనిత, తదితరులు పాల్గొన్నారు.

# ఎందయ్యు గురుకులాల సంగతి మంత్రి గారు..?



**హైదరాబాద్, జులై 26, నేటి శుభోదయ :** మంథని నియోజకవర్గంలో విద్యార్థుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది! హాస్టళ్లు చదువు చెప్పే దేవాలయాలు కావు.డెంజర్ జోన్లుగా మారాయి!మొన్నటికి మొన్న మంథని బాలుర గురుకుల పాఠశాలలో అమాయక విద్యార్థులతో 'ప్రాంక్' పేరుతో డెటాల్ తాపించారు.మరో వైపు చెవిలో యాసిడ్ పోస్తామని బెదిరించే పరిస్థితి వచ్చిందంటే అక్కడ విద్యార్థుల భద్రత ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.టీచర్ కొడతాడనే భయంతో విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలవుతున్నారు.హాస్టల్ కాంపౌండ్ గోడలు దూకి విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతుంటే..ఈ గురుకుల సిబ్బంది,వార్డెన్లు ఏం చేస్తున్నారు? ఈ నిజాలను బయటకు రాకుండా దాచాలని చూస్తుండటం సిగ్గుచేటు!. మరి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి ఏం చేస్తున్నారు?.మీ స్వంత నియోజక వర్గం మంథనిలోనే గురుకులాలుఅనాథాశ్రమాల్లా మారి, విద్యార్థుల ప్రాణాలు గాలిలో దీపాల్లా మారుతుంటే మీ నిఘా ఏది? మీ పర్యవేక్షణ ఏది?"సొంత నియోజకవర్గంలో చిన్న పిల్లలకు,విద్యార్థులకు కనీస భద్రత కల్పించలేని ఐటీ మినిస్టర్.తన పదవిలో కొనసాగే అర్హతను పూర్తిగా కోల్పోయారు.ఈ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయన వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలి!"మా బిజెపి పార్టీ తరఫున మేము డిమాండ్ చేస్తున్నాం.కఠిన చర్యలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి ఈ దారుణాలను గోప్యంగా ఉంచాలని చూసిన గురుకుల సిబ్బందిపై,ఉపాధ్యాయులపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి.కౌన్సెలింగ్,సెక్యూరిటీ,హాస్టళ్లలో భద్రతను పెంచి,ప్రమాదకర రసాయనాలు పిల్లలకు అందుబాటులో లేకుండా చేయాలి.విద్యార్థులకు నిపుణులతో కౌన్సెలింగ్ నిర్వహించాలి.బాధిత విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు,హాస్టళ్లలో మార్పు వచ్చే వరకు బిజెపి

# విద్యా వ్యవస్థ పునర్నిర్మాణానికి ఇది తొలి అడుగు.



**శేరిలింగంపల్లి, జులై 26, నేటి శుభోదయ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం దేశ విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, పారదర్శకత నెలకొల్పే దిశగా ఒక కీలక పరిణామమని ట్రూ హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మారమోని శ్రీశైలం యాదవ్ పేర్కొన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ, విద్యా వ్యవస్థలో చోటుచేసుకున్న అవకతవకలు, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన ఘటనలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత చేపట్టిన నిరంతర ఉద్యమానికి ఈ పరిణామం ఒక విజయంగా నిలిచిందని ఆయన అన్నారు. విద్యార్థుల ఐక్యత, పట్టుదల, ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటం ముందు కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సి రావడం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు.దేశ భవిష్యత్తును నిర్మించేది విద్యా వ్యవస్థ. అలాంటి పవిత్రమైన వ్యవస్థలో ప్రశ్నపత్రాల లీకేజీలు, అవినీతి, నిర్లక్ష్యం వంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల కష్టాన్ని, తల్లిదండ్రుల ఆశలను దెబ్బతీసే ప్రతి అక్రమానికి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఉద్యమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి, యువతకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా నిలబడి దేశానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. వారి పోరాట స్ఫూర్తి దేశ ప్రజాస్వామ్యానికి బలాన్ని చేకూర్చిందన్నారు.ఇకపై దేశంలో కానీ, రాష్ట్రాల్లో కానీ ఏ పరీక్షకు సంబంధించిన పేపర్ లీకేజీ జరిగినా సంబంధిత అధికారులపై, బాధ్యత వహించే మంత్రులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాలను కోరారు. బాధ్యులపై వేగవంతమైన విచారణ జరిపి, చట్టప్రకారం కఠిన శిక్షలు విధించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అలాగే దేశవ్యాప్తంగా నిర్వహించే పోటీ పరీక్షల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, ప్రశ్నపత్రాల భద్రతను మరింత బలోపేతం చేయాలని, స్వతంత్ర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి పూర్తిస్థాయి పారదర్శకతతో పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థుల ప్రతిభకు మాత్రమే ప్రాధాన్యత లభించేలా, అవినీతి మరియు అక్రమాలకు పూర్తిగా తావులేని విద్యా వ్యవస్థను నిర్మించడమే నిజమైన సంస్కరణల లక్ష్యమని ఆయన అన్నారు. దేశ యువతకు న్యాయం జరిగేలా ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు తీసుకు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# లైఫ్ కేర్ హాస్పిటల్ వారు ఎస్‌బీ పల్లిలో ఉచిత వైద్య శిబిరం





**షాద్ నగర్, జులై 26, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం ఎస్బి పల్లి గ్రామము లో లైఫ్ హాస్పిటల్ వారు గ్రామీణ పట్టణ ప్రాంత ప్రజలకు ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వారికి ఎలాంటి ఖర్చు లేకుండా ప్రాథమిక వైద్య సేవలు పరీక్షలు అందించే తాత్కాలిక ఆరోగ్య కార్యక్రమాలు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో లైఫ్ కేర్ హాస్పిటల్ వారు ఎస్‌బీ పల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు గ్రామ ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సున్నాల గణేష్,వార్డు సభ్యులు పాల్గొని వైద్య శిబిరాన్ని పరిశీలించారుఈ సందర్భంగా లైఫ్ కేర్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు వైద్య సిబ్బంది గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు వివిధ ఆరోగ్య సమస్యలపై ప్రజలకు సూచనలు సలహాలు అందించడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు ఈశిబిరానికి గ్రామ ప్రజలు మహిళలు యువకులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారుగ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఉపసర్పంచ్ సున్నాల గణేష్ అన్నారు మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంలో ఉచిత వైద్య శిబిరాలు ఎంతో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు వైద్య శిబిరాన్ని నిర్వహించిన డాక్టర్ విజయ్‌తో పాటు లైఫ్ కేర్ హాస్పిటల్ వైద్యులు సిబ్బందికి గ్రామ పంచాయతీ తరఫున ఉపసర్పంచ్ సున్నాల గణేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ప్రజల ఆరోగ్యమే గ్రామ అభివృద్ధికి పునాది అని భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే మరిన్ని ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో కుమ్మరిగూడ పాండు,జామకాయల కృష్ణయ్య,ఎమ్మె మల్లయ్య,ఎమ్మె రజిత,గురుడు శ్రీలత,ఎమ్మె శ్రీకాంత్,మల్లారెడ్డి,దండు తిరుపతయ్య,ఎమ్మె రఘు,ఎమ్మె మల్లేష్,తోట్ల శ్రీనివాస్,బుడుగు బిచ్చపతి,గ్రామ ప్రజలు,మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు

# రాజీనామా పరిష్కారం కాదు..
# పరీక్షల వ్యవస్థనే ప్రక్షాళన చేయాలి



**హైదరాబాద్, జూలై 26, నేటి శుభోదయ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినంత మాత్రాన నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల నిర్వహణలో తలెత్తిన సంక్షోభానికి పరిష్కారం దొరికినట్లు కాదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, బీసీ జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుజ్జ సత్యం అన్నారు. 'రాజీనామా అనేది వైఫల్యానికి రాజకీయ, నైతిక బాధ్యత వహించడమే తపప.. వ్యవస్థలోని లోపాలకు చికిత్స కాదని, మంత్రి మారవచ్చు.. కానీ వ్యవస్థ మారకపోతే మరో పేపర్ లీక్ జరగదనే భరోసా ఎవరు ఇస్తారని ఆయన ప్రశ్నించారు. ఆదివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... వ్యక్తులు కాదు.. వ్యవస్థ మారాలని, ఒక మంత్రి రాజీనామా చేయడం, అధికారులను బదిలీ చేయడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని అన్నారు. ప్రశ్నపత్రం తయారీ నుంచి పరీక్ష నిర్వహణ, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలో పారదర్శకత, భద్రత, జవాబుదారీతనం ఉండేలా సమగ్ర సంస్కరణలు చేపట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు కావాల్సింది రాజీనామాలు కాదని, నిష్పక్షపాతంగా పరీక్ష జరుగుతుందనే భరోసా డబ్బు, పలుకుబడి, మాఫీయా కంటే ప్రతిభకే విలువ ఉంటుందనే నమ్మకం కల్పించాలని ఆయన పేర్కొన్నారు.

# 18 ఏళ్ల నిరీక్షణ ఫలించిన రోజున...






**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :** 18 ఏళ్ల తర్వాత పూర్వ మిత్రులు ఒక చోట కలిశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నేరడ గ్రామంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007– 08 వ సంవత్సరంలో 10 వ తరగతి చదివిన విద్యార్థులు నేడు అనగా ఆదివారం నాడు ఒక చోట కలిసి ఆడి పాడారు. తాము చదువుకున్న పాఠశాలకు ఏదో చేయాలనే తపనతో తమ పాఠశాలకు 20 వేల ఆర్థిక సాయం అందించారు. పదవ తరగతి పూర్తయిన తర్వాత అందరూ ఎక్కడికి ఎక్కడికో వెళ్ళి చదువులు పూర్తి చేసి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూ స్థిరపడి పోయారు. ఎన్నోసార్లు కలుద్దామనుకున్న బిజీ షెడ్యూల్ లో కలవలేక మిత్రులను కలవాలి అనే తపనతో ఉన్నవారికి నగరంలోని గొల్లగూడెం ప్రాంతంలో ఉన్న కావేరీ రిసార్ట్స్ వేదికగా మారింది. తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి వారిని సన్మానించి తమకు ఉపాధ్యాయుల పై ఉన్న అమితమైన గౌరవాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి బాధ్యుడు గా వ్యవహరించిన దూసరి కళ్యాణ్ ను ఉపాధ్యాయులు, తోటి మిత్రులు అభినందించారు.

# గుంతలమయమైన దిండి
## - దేవరకొండ రహదారి..





**దిండి గుండ్లపల్లి, జూలై 26, నేటి శుభోదయ :** దిండి మండల కేంద్రం నుంచి దేవరకొండకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతో ప్రతిరోజూ ఈ మార్గంలో రాకపోకలు సాగించే పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, లారీలు, బస్సుల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలను నెమ్మదిగా నడపాల్సి వస్తుండటంతో ప్రయాణ సమయం పెరగడంతో పాటు ప్రమాదాల భయం వెంటాడుతోంది.వర్షాల కారణంగా రహదారి మరింత దెబ్బతిని గుంతలు విస్తరించాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చి రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

## ముత్యాలరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన నరేష్ జాదవ్



**ఏన్కూరు, జులై 26, నేటి శుభోదయ :** ఏన్కూరు మండల పరిధిలోని జన్నారం గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కార్యాలయం గుమస్తా ముత్యాలరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ముత్యాలరావు కుటుంబానికి నరేష్ జాదవ్ ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ..... పంచాయతీ కార్యాలయంలో అందరితో కలివిడిగా ఉంటూ ఆయన మంచి పేరు సంపాదించారని, ముత్యాలరావు కుటుంబం ఆర్థికంగా వెనకబడి ఉండటంతో తమవంతుగా దశదినకర్మకు ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. ఆయన కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ముత్యాలరావు మృతి చెందడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆయన కుటుంబానికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని నరేష్ జాదవ్ కోరారు.

## 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించిన బీజేపీ నాయకులు



**నేరేడ్మెట్, జూలై 27, నేటి శుభోదయ :** వినాయక్‌నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి ఆదివారం తన నివాసంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశాభివృద్ధి, ప్రజల భాగస్వామ్యం, సామాజిక బాధ్యత తదితర అంశాలపై చేసిన ప్రసంగాన్ని కార్యకర్తలు ఆసక్తిగా ఆలకించారు. అనంతరం క్యానం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రజల్లో స్ఫూర్తి నింపే అంశాలతో పాటు దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడి పాత్రను గుర్తు చేస్తూ ప్రధాని ప్రతి నెల 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా విలువైన సందేశాలను అందిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌలికర్ ఆనంద్, ఓం ప్రకాష్, రాములు, జాదీశ్వర్, రాఘవయ్య, సంతోష్, మల్లేష్, సాయి సురేష్, నరేందర్, రమేష్, గోపాల్, ప్రశాంత్, ప్రదీప్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

## చోద్యం చూస్తున్న ఖమ్మం టౌన్ ప్లానింగ్ అధికార యంత్రాంగం







**ఖమ్మం, జూలై 27, నేటి శుభోదయ** ఖమ్మం నగరం ఇటీవల విపరీతంగా విస్తరిస్తోంది. ఖమ్మం నగరంలో ఇటీవల బైపాస్ రోడ్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. పట్టణ ప్రణాళికలో కీలకమైన నియమాలను విస్మరించి, ఇటీవలికాలంలో అనుమతి లేకుండా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. అత్యవసరంగా స్పందించాల్సిన ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు మాత్రం మౌనంగా చూసీ చూడనట్లు ఉంటూ, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారు.అక్రమంగా నాలుగు, ఐదు అంతస్తుల భవనాలు ఎలా రూపుదిద్దుకుంటున్నాయి? ఎవరి అనుమతితో ఈ నిర్మాణాలు? వీటి వెనుక ఉన్న నిర్మాణ మాఫియాతో అధికారుల చేతులు కలపడమా? అనే అనుమానాలు పెరుగుతున్నాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, మీడియా లో ప్రచారం అయినా పట్టించుకోని వైఖరి చూస్తుంటే, మామూళ్ల మత్తులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు అనిపించకమానదు.ప్రజల భద్రతకు భంగం కలిగించే నిర్మాణాలు, అవసరమైన పార్కింగ్ సౌకర్యం లేకుండా కేవలం లాభాల కోసం భవనాలను నిర్మించడం, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించకపోవడం వంటి అంశాలు నగర అభివృద్ధిని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ఇటువంటి అక్రమ నిర్మాణాల వల్ల రేపు జరిగే భయానక ప్రమాదాలకు బాధ్యత ఎవరిదీ?మున్సిపల్ యంత్రాంగం ఎందుకు నిశ్చలంగా వ్యవహరిస్తోంది? చట్టాలను ఉల్లంఘించే నిర్మాణాలపై విచారణలూ ఉండకపోతే, దీనికి పాలనా వైఫల్యానికి నిదర్శనం. పాలకులు, ప్రజా ప్రతినిధులు దీనిపై స్పందించకపోతే, ప్రజాస్వామ్యం మూగవుతున్నదే కాక, ప్రజల ప్రాణాలకు ప్రమాదం తలెత్తే అవకాశం ఉంటుంది.అక్రమ నిర్మాణాలపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. అనుమతులు లేకుండా నిర్మించిన బిల్డింగ్‌లను గుర్తించి నోటీసులు జారీ చేయాలి. మున్సిపల్ అధికారుల వైఫల్యంపై విజిలెన్స్ లేదా ఎసిబి స్థాయిలో విచారణ జరగాలి.నగర అభివృద్ధిలో పారదర్శకత ఉండే విధంగా ప్రజలకు సమాచారం అందించాలి.ఒక నగరం అభివృద్ధి చెందాలి అంటే భవనాలే కాదు, చట్టాల పటిష్టతా అవసరం. అక్రమాలకు వ్యతిరేకంగా అంతులేని మౌనం విరమించి, స్పందన చూపించాలి అధికార యంత్రాంగం. నేటి నిర్లక్ష్యం, రేపటి విపత్తుకు కారణం కావద్దు మరి.

## దేశ ఉద్యమాలలో యువతదే కీలకపాత్ర - ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు జాగర్లమూడి రంజిత్ కుమార్ పిలుపు



**ఏన్కూర్, జులై 26, నేటి శుభోదయ :** అఖిలభారత యువజన సమాఖ్య ఏన్కూరు మండల మహాసభ రజబ్ అలీ భవన్ నందు జరిగింది. ముందుగా జెండా ఆవిష్కరణ ఏ ఐ వై ఎఫ్ మాజీ జిల్లా నాయకులు అమరనేని వీరభద్రం జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం అమరనేని అరుణ్ అధ్యక్షతన నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగర్లమూడి రంజిత్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ..... భారతదేశంలో జరిగిన ఉద్యమాలన్నిటికీ యువతే ప్రాణం పోశారని నాడు స్వాతంత్రం ఉద్యమంలో భగత్ సింగ్ లాంటి ఎంతోమంది యోధాన యోధులు స్వతంత్ర సంగ్రామం సాగించి భారతదేశ స్వాతంత్ర పోరాటలతో స్వాతంత్రాన్ని సాధించారని, తెలంగాణ సాయుధ పోరాటంలో కూడా ఎక్కువమంది యువకులే ఉన్నారని నాడు వేల ఎకరాలు పంచిన పోరాటంలో కూడా యువత కీలక పాత్ర వహించారని, తెలంగాణ రాష్ట్ర తొలి దశ ఉద్యమంలో మన ఉద్యోగాలు మనకు రావాలని చేసిన ఉద్యమం అజరామమని, భారతదేశంలో జరిగిన ఏ ఉద్యమమైన యువతే నడిపారని భవిష్యత్తులో గతంలో జరిగిన ఉద్యమాలను నెమరువేస్తూ , యువత హక్కులను సాధించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి యువకులకు అనుసరిస్తున్న విధానాలపై ప్రస్తుత యువనాయకత్వం దృష్టిసారించాలని ఇచ్చిన హామీలు నెరవేరేంతవరకు పోరు సాగించాల్సినటువంటి అవసరం ప్రస్తుత యువతకి ఉందని అన్నారు. డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల కుయువత బానిసలు కాకుండా చూడాలని కోరారు . అనంతరం మండల నూతన కమిటీని 15 మంది సభ్యులుగా ఎన్నుకున్నారు .మండల అధ్యక్షులుగా బండి భీమేష్, మండల కార్యదర్శిగా అమరనేని అరుణ్ ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు బానోతు రాంబాబు, ఏ ఐ ఎ వై ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దోజు శ్రావణ్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, బండ వీరభద్రం, అంజి, గోపి, తదితరులు పాల్గొన్నారు

## సిద్ధినేని హేమలత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కూనంనేని



**ఖమ్మం, జులై 26, నేటి శుభోదయ :** ఖమ్మం రూరల్ మండలం గూడూరుపాడు గ్రామానికి చెందిన సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్ తల్లి సిద్ధినేని హేమలత ఇటీవల మృతి చెందారు. ఆ సమయంలో వ్యక్తిగత, పార్టీ కార్యక్రమాల కారణంగా పరామర్శకు హాజరుకాలేక పోయిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం వారి నివాసానికి వెళ్లి వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి,పార్టీ తరపున అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, సిపిఐ గ్రామ మాజీ సర్పంచ్ బండి ఉపేందర్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బండి సాయి, సహాయ కార్యదర్శి దాసరి పున్నయ్య, గ్రామ నాయకులు గోగినపల్లి రామ్మూర్తి, సిద్ధినేని బోసు, కర్ణం ఉపేందర్, పొడేటి అంజయ్య, భాస్కర్, హేమంత్, వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## మన్ కీ బాత్ వీక్షించిన అర్బన్ ఎమ్మెల్యే



**నిజామాబాద్, జూలై 26, నేటి శుభోదయ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 136వ "మన్ కీ బాత్" కార్యక్రమాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో వీక్షించారు.కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించి,భారత సైనికుల ధైర్యసహసాలను ప్రధానమంత్రి కొనియాడారు."ఆత్మనిర్భర్ భారత్" రక్షణ రంగం గురించి మాట్లాడుతూ..స్వదేశీ యుద్ధనౌక ఐఎన్ఎస్ మహేంద్రగిరి,డిఆర్డిఓ అభివృద్ధి చేస్తున్న రక్షణ సాంకేతికతలను ప్రశంసించారు.ముఖ్యంగా "క్యాచ్ ద రైన్"ఉద్యమం విజయవంతమైందని పేర్కొంటూ ప్రతి పౌరుడు వర్షపు నీటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.అలాగే యువత విజయాల గురించి మాట్లాడుతూ..జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ గెలిచిన తెలుగు తేజం పి.వి సింధును అభినందించారు.అలాగే యువ శాస్త్రవేత్తలు,ఆవిష్కర్తలను ప్రశంసించారు.మణిపూర్ కు చెందిన ఖగోళ శాస్త్రవేత్త డాక్టర్ రోనాల్డో లైషరామ్ అంతర్జాతీయ స్థాయిలో సాధించిన పరిశోధన విజయాన్ని ప్రస్తావించి అభినందించారు.స్థానిక కళలు సంస్కృతి పరిరక్షణ పై దృష్టి సారిస్తూ కాశ్మీర్ కు చెందిన సంప్రదాయ "వాగూవ్" చాపల కలను,త్రిపురకు చెందిన చెంగ్ ప్రేంగ్ వాద్యాన్ని పెంచిన వారిని ప్రశంసిచారు.అలాగే పర్యావరణం విడుదల నిర్వహణ మహిళల సాధికారతకు సంబంధించిన పలు స్థానిక కార్యక్రమాలను ఉదాహరణలుగా ప్రస్తావించి దేశవ్యాప్తంగా జరుగుతున్న స్ఫూర్తిదాయక ప్రయత్నాలను కొనియాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ..ప్రధాని నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్' రాజకీయ కార్యక్రమం కాదని,దేశంలో స్ఫూర్తిదాయకమైన వ్యక్తులు,జాతీయ విలువలు,ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి అనే అంశాలను ప్రజలకు చేరవేసే వేదిక అన్నారు.కార్గిల్ వీరుల త్యాగం నుంచి నీటి సంరక్షణ వరకు,స్వదేశీ రక్షణ సామర్థ్యం నుంచి యువత విజయాల వరకు ప్రతి అంశం దేశాన్ని మరింత బలోపేతం చేసే దిశలో ప్రజలను ప్రేరేపించే సందేశాన్ని ఇచ్చారన్నారు.కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి,ప్రధాన కార్యదర్శి,19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ,మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత,యువ మోర్చా అధ్యక్షులు వంశీ,మైనార్టీ మోర్చా జస్పాల్ సింగ్,కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్,మఠం పవన్,జ్యోతి మురళి,ఇప్పకాయల సుమిత్ర కిషోర్,మమత శివ,యువ మోర్చా రాష్ట్ర నాయకులు విజయ్,పవన్ ముందడ తదితరులు పాల్గొన్నారు.

## వెల్జాల్‌లో ఘనంగా తెలంగాణ ఉద్యమకారుడు భాస్కర్ జన్మదిన వేడుకలు: పేద కుటుంబానికి బియ్యం పంపిణీ




**తలకొండపల్లి, జులై 26, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ జనహృదయనేత,తెలంగాణ ఉద్యమకారుడు రాచమల్ల భాస్కర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆయన స్వగ్రామమైన వెల్జాల్‌లో ఆదివారం ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు.భాస్కర్ జన్మదినం సందర్భంగా గ్రామంలోని ఒక నిరుపేద కుటుంబానికి మానవతా దృక్పథంతో సాయం అందించారు.ఈ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన ఈశ్వర్–కవిత కుటుంబ సభ్యులకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబాలను ఆదుకోవడమే రాచమల్ల భాస్కర్ ఆశయమని, ఆయన మార్గంలోనే ఈ సాయం అందించామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,యువకులు రాఘవేందర్, శ్రీశైలం, రిపోర్టర్ విజయ్, యాదగిరి,యువకులు రాఘవేందర్, సాయి,సుల్తాన్, గణేష్, కుమార్, రమేష్, రవి తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.రాచమల్ల భాస్కర్ ఈ సందర్భంగా వారు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

## సైనికుల త్యాగాలతోనే మన దేశానికి నిత్య భద్రత -విద్యా సామాజిక సేవకులను సత్కరించిన జిల్లా ఇంటిలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్





**ఖమ్మం, జులై 26, నేటి శుభోదయ :** దేశంలో సైనికుల త్యాగాలతోనే మనకు నిత్యం భద్రత ఏర్పడి ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించగలుగుతున్నారని జిల్లా ఇంటిలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్ తెలిపారు. స్థానిక ఎన్ ఎస్ సి కాలనీలోని ఫ్రీడమ్ పార్కులో ఆదివారం జరిగిన కార్గిల్ విజయ్ దివాస్ ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత జిల్లా ఎస్పీ రామోజీ రమేష్ , జిల్లా సైనిక సంక్షేమ అధికారి చంద్రశేఖర్, మాజీ సైనిక ఉద్యోగుల రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్ ఎం అరుణ్ తో కలిసి అమర జవాన్లకు ఘనంగా నివాళి అర్పించారు. ఎన్సిసి క్యాడట్లు, మాజీ సైనిక ఉద్యోగులు ఈ నివాళి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కార్గిల్ విజయ్ దివాస్ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఇంటిలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్ మాట్లాడుతూ అమర జవాన్ల ప్రాణ త్యాగంతోనే జమ్మూ కాశ్మీర్ లోని కార్గిల్ ప్రాంతం రక్షింపబడిందని తెలిపారు. మన జవాన్లు 60 రోజులపాటు శత్రువులతో గడ్డకట్టే చలిలో పోరాడి కార్గిల్ ప్రాంతాన్ని రక్షించారని, ఈ పోరాటంలో 567 మంది మన జవాన్లు అమరులయ్యారని వారి అమరత్వాన్ని గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం జులై 26న కార్గిల్ విజయ్ దివాస్ ను దేశమంతటా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్గిల్ విజయ్ దివాస్ స్ఫూర్తి మరో వందేళ్లు కలకాలం కొనసాగాలని తెలిపారు. విద్యార్థులు, యువత జవాన్ల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని దేశ రక్షణలో భాగస్వాములు కావడానికి అప్రమత్తంగా ఉండాలని కోరారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండదండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ




సైనిక ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్ ఎం అరుణ్ , రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ వరప్రసాద్, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సుభాన్, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, వెటర్న్ సైనికుల జిల్లా ప్రతినిధి హనుమంతరావు, మాజీ సైనిక ఉద్యోగులు, వివిధ పాఠశాలల, కళాశాలల ఎన్సిసి క్యాడెట్లు , తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యా , సామాజిక సేవలు అందిస్తున్న ఫిట్ ఇండియా సంస్థ బాధ్యులు ఫర్హ, సంభాని నగర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు గౌరీ, ఉపాధ్యాయురాలు సూర్యకుమారి, స్టేట్ అవార్డు గ్రహీత వార్డెన్ కోటపాటి రుక్మారావు , నిర్మల హృదయ్ స్కూల్ కరస్పాండెంట్ సాంబశివారెడ్డి లను జిల్లా ఇంటెలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్ శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్సిసి క్యాడెట్లు నిర్వహించిన ఎన్సిసి విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ గా మెండెం కిరణ్ ఎన్నిక



**ఖమ్మం, జులై 26, నేటి శుభోదయ :**
ఉమ్మడి ఖమ్మం జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ గా రైట్ చాయిస్ అకాడమీ అధినేత మెండెం కిరణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఖమ్మం లోని సితార గ్రాండ్ లో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన హ్యాండ్ బాల్ అసోసియేషన్ సభ్యులందరూ కిరణ్ అభ్యర్థిత్వాన్ని బలపరిచి ఎన్నికను ఏకగ్రీవం చేశారు. గత పదేళ్లుగా జిల్లాలో లక్షలాది మంది యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించడంలో కిరణ్ ముందున్నారని సభ్యులు కొనియాడారు. ఈ సందర్భంగా మెండెం కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో క్రీడారంగ అభివృద్ధికి పాటుపడుతూ , క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ అధ్యక్షులుగా అశోక్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా వరికూటి మోహన్, కోశాధికారిగా కోపెల తంభి ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను పర్యవేక్షించేందుకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అబ్జర్వర్ గా ఎండీ గౌస్, స్టేట్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ మెంబర్ రమేష్, ఒలింపిక్ అసోసియేషన్ అబ్జర్వర్ ఉప్పల్ రెడ్డి ఈ ఎన్నికలను పర్యవేక్షించారు.

## కేశంపేటలో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**కేశంపేట, జులై 26, నేటి శుభోదయ :**
కేశంపేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవుట్‌సోర్సింగ్ విధానంలో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎం. చంద్రశేఖర్ తెలిపారు. బిఎస్సి (కంప్యూటర్స్), ఏదైనా డిగ్రీతో పాటు పిజిడిసిఏ, బీటెక్ (కంప్యూటర్స్), ఎంసీఏ అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈ నియామకాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల ధ్రువపత్రాలతో పాటు అవసరమైన పత్రాలను జత చేసి జూలై 28, 2026 మధ్యాహ్నం 2 గంటలలోపు కేశంపేట మండల విద్యా వనరుల కేంద్రం (ఎం ఆర్ సి)లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. నియామకాలు పూర్తిగా అవుట్‌సోర్సింగ్ విధానంలో చేపడతామని అధికారులు వెల్లడించారు.

## గులాబీ జెండాను అడ్డుకోవాలనే కాంగ్రెస్ కుట్రలు సాగవు : మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

**ఖమ్మం, జులై 26, నేటి శుభోదయ :** ఖమ్మం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని బలహీనపరిచే శక్తి ఎవరికీ లేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలోని 8వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మె వద్ద జెండాను ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ జెండా దిమ్మెలను తొలగించడం, గులాబీ జెండాను అడ్డుకోవడం ద్వారా పార్టీని నిలువరించాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు ఎప్పటికీ ఫలించవని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార అహంకారంతో ప్రగల్భాలు పలుకుతున్నారని ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ పార్టీకి ఉన్న స్థానం ఎవరూ చెరపలేరని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ అని, కోట్లాది మంది ప్రజల ఆశయాలు, త్యాగాల ప్రతీక అయిన గులాబీ జెండాను అని స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఖమ్మం నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామనీ గుర్తు చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్ వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకొచ్చామని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ప్రజలకు చెప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదని విమర్శించారు. కనీస పారిశుద్ధ్య నిర్వహణలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,



ఖమ్మం నగరంలో అనేక ప్రాంతాలు చెత్తకుప్పలుగా మారిపోయాయని ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.బీఆర్ఎస్ పార్టీపై రాజకీయ కక్షతో జెండా దిమ్మెలను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఇటువంటి బెదిరింపులకు, కుట్రలకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఏమాత్రం భయపడరని, ప్రతి డివిజన్‌లో, ప్రతి గ్రామంలో గులాబీ జెండా మరింత ఎత్తుగా రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ఎప్పటికీ మరచిపోరని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలకు తగిన సమయంలో ప్రజలే గుణపాఠం చెబుతారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు.

## నాలుగు గుంటల భూమి . సుమారు 20 లక్షల విలువైన భూదానం చేసిన మాజీ సర్పంచ్ పట్లోళ్ల అమరేందర్ రెడ్డి



**సంగారెడ్డి, జులై 26, నేటి శుభోదయ :** సదాశివపేట మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో గల శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయ నిర్మాణానికి ఆత్మకూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పట్లోళ్ల సరళ అమరేందర్ రెడ్డి ఆలయ నిర్మాణానికి నాలుగు గుంటల విలువైన భూమిని ఆలయానికి దానం సుమారు 20 లక్షల విలువైన భూమిని దానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామంలోని పెద్దలందరూ పాల్గొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సంగమేశ్వరా చారి మాట్లాడుతూ ఎంతో విలువైన భూమిని ఆలయానికి ఇవ్వడం చాలా సంతోషకరమని, వారి కుటుంబ సభ్యులకు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి యొక్క ఆశీర్వాదం ఉండాలని కోరారు. సందర్భంగా ఆత్మకూరు గ్రామ సర్పంచ్ నికిత బింభదర్ చారి మాట్లాడుతూ విలువైన భూమిని ఆలయానికి ఇవ్వడం చాలా గొప్ప విషయం అని, డబ్బు చాలామంది దగ్గర ఉంటుంది కానీ దానం చేసి కొందరిలో ఉంటుందని ఆ కొందరిలో మా ఊరిలోని అమరేందర్ రెడ్డి గారు ముందు వరుసలో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు గురురాజు స్వామి, కల్పగూరి ప్రభు, నాగయ్య స్వామి, రమేష్, వినోద్, మరియు ఆలయ కమిటీ సభ్యులు సంగమేశ్వర్ చారి,బక్కన్న చారి , రాములు చారి,నర్సింలు చారి, సదాశివుడు చారి,వీరన్న చారి, రామచందర్ చారి,నిరంజన్ చారి, భిక్షపతి చారి,అనిల్ చారి పాల్గొన్నారు.

## భీమ్ గల్ లో 'జూనియర్ సివిల్ కోర్టు' ప్రారంభం



**నిజామాబాద్ రూరల్ భీంగల్, జులై 26, నేటి శుభోదయ :** స్థానిక గ్రామీణ ప్రాంత ప్రజలకు, వ్యాజ్యదారులకు వేగవంతమైన మరియు సులువైన న్యాయ సేవలు అందించడమే లక్ష్యంగా స్థానికంగా కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, నిజామాబాద్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ తంగిరాల మాధవీ దేవి తెలిపారు.భీమ్ గల్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'జూనియర్ సివిల్ జడ్జి-కమ్-జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు'ను ఆదివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా జస్టిస్ మాధవీ దేవి మాట్లాడుతూ.. భీమ్ గల్ మరియు దాని పరిసర ప్రాంతాల ప్రజలు ఇకపై కోర్టు పనుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. స్థానికంగా కోర్టు అందుబాటులోకి రావడం వల్ల బాధితులకు సమయంతో పాటు ఆర్థిక భారం కూడా ఎంతగానో తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మీ నారాయణ అలిశెట్టి, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీవీఎన్ భరత లక్ష్మి హాజరయ్యారు. అలాగే ఆర్మూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ చందర్, సీనియర్ న్యాయవాదులు చైతన్య, సూర సురేష్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక న్యాయవాదులు విశేషంగా పాల్గొన్నారు.

## మహేష్ హత్య కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు నగర సిపి ఎన్.శ్వేత వెల్లడి



**వరంగల్, జులై 26, నేటి శుభోదయ :** పాత కక్షలు, రాజకీయ విభేదాల నేపథ్యంలో అడపు మహేష్ అనే వ్యక్తిని పెట్రోల్ పోసి సజీవ దహనం చేసిన కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత వెల్లడించారు. వరంగల్ కమిషనరేట్ లో డిసిపి అంకిత్ తో కలిసి ఆదివారం విలేకరులతో మాట్లాడారు.ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించగా, మరో నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. నగరంలోని ఏనుమాముల ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన అడుపు మహేష్ (45) వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. బాలాజీ నగర్‌కు చెందిన పత్తి కుమారస్వామి అలియాస్ కుమార్ గతంలో హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తూ ప్రస్తుతం బెయిల్‌పై బయటకు వచ్చాడని తెలిపారు. మహేష్ తనపై తప్పుడు ప్రచారం చేస్తూ స్థానిక ప్రజా ప్రతినిధి వద్ద రాజకీయంగా తన ప్రాధాన్యతను దెబ్బతీస్తున్నాడనే అనుమానంతో కుమార్ కక్ష పెంచుకున్నట్లు సీపీ తెలిపారు. ఈ క్రమంలో మహేష్‌ను హత్య చేయాలని కుమార్ తన అనుచరులు గంధం నరేష్, జన్ను మధు, పిట్ల శ్రీనివాస్, లాసాని రామ్‌సాయి, టోని సంజయ్య, పోతారం శివకుమార్, సురేష్‌లతో కలిసి పథకం రచించాడని తెలిపారు. ఈ నెల 18వ తేదీ రాత్రి పరిమళ కాలనీ రోడ్ నంబర్-2 వద్ద మహేష్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించారన్నారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేష్ మరుసటి రోజు రాత్రి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారని అన్నారు. సి ఐ విశ్వేశ్వర్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు వేగంగా వ

## ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి
### : కుల్కచర్ల తహశీల్దార్ పురుషోత్తం



**వికారాబాద్ ,జూలై 26, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: ప్రత్యేక ఓటర్ల నమోదు (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని కుల్కచర్ల తహశీల్దార్ పురుషోత్తం బీఎల్ఓలకు ఆదేశించారు. ఆదివారం కుల్కచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటర్ల నమోదు పనులను పరిశీలించిన ఆయన, ప్రక్రియ పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు 79.42 శాతం ఓటర్ల నమోదు పూర్తయిందని తెలిపారు. మిగిలిన దరఖాస్తులను కూడా ఆలస్యం చేయకుండా గడువులోగా పూర్తి చేసి, బీఎల్ఓలు తమకు కేటాయించిన వార్డుల్లో సేకరించిన ఓటరు నమోదు ఫారాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా నిబంధనల ప్రకారం పనిచేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవీందర్ చారి, సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## వెల్జాల్ అభివృద్ధి ప్రదాత! ఘనంగా మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు

**నేటిశుభోదయ, జూలై 26, నేటి శుభోదయ :** తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు ఆదివారం మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగాయి.ఆధ్యాత్మిక సేవలతో వేడుకల ప్రారంభం జన్మదినం సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ ముందుగా ప్రసిద్ధి చెందిన మైసిగండి మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.అనాథ శరణాలయంలో ఉదారత ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం తలకొండపల్లి మండల కేంద్రంలోని ఉప్పల అనాథ శరణాలయంలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి తన సంతోషాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని ఏర్పాటు చేసి వారి పట్ల తనకున్న ప్రేమాభిమానాలను చాటుకున్నారు.వేదాద్రి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయం లో స్వామివారికి ప్రత్యేక అర్చనలు పూజలు నిర్వహించారు.వేద పండితులు సి ఎల్ శ్రీనివాస్ యాదవ్ కు వేద ఆశీర్వాదం అందించారు.హోరెత్తిన అభిమానం.. కేక్ కటింగ్‌లు,బస్టాండ్ సెంటర్‌లో:తలకొండపల్లి బస్టాండ్ సెంటర్‌లో పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు భారీ ఏర్పాట్ల మధ్య కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా తనపై చూపుతున్న అభిమానానికి ఆయన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అనంతరం:వెల్జాల్ గ్రామంలో స్థానిక కార్యకర్తలు ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు.తదుపరి ఆయన నివాసం వద్ద కోలాహలం అనంతరం శ్రీనివాస్ యాదవ్ నివాసం వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్న అభిమానులు,నాయకులు ఆయనతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షల వెల్లువ కురిపించారు.ఆత్మీయంగా తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయన పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.పాల్గొన్న ప్రముఖులు ఈ వేడుకల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు,కార్యకర్తలు,సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీనివాస్ యాదవ్‌కు ఆయురారోగ్యాలు,ఆనందాలు కలగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.





## షాబాద్ జెడ్పీహెచ్ఎస్ 1995-96 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**షాబాద్ , జులై 26, నేటి శుభోదయ :** షాబాద్ మండలంలోని సంకేపల్లి గూడ సమీపంలోని ఓ ఫామ్‌హౌస్‌లో షాబాద్ జెడ్పీహెచ్ఎస్ 1995–96 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్నో సంవత్సరాల అనంతరం ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత అనుభవాలను పంచుకున్నారు.ఈ కార్యక్రమానికి విశ్రాంత ఉపాధ్యాయులు జడల వీరస్వామి గౌడ్, లింగం, శ్రీనివాసరావు, శ్రీదేవి, రాఘవేంద్రరావు, కుమారస్వామి, జగదీశ్వర్, సుదర్శన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్ గుప్తా, ఆరేసత్యం,రవీందర్, ఎర్రోళ్ల శీను ,ప్రసాద్, వీరేష్ ,మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు,

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి,యువత విజయం

**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థుల ఐక్య పోరాటానికి దక్కిన విజయమనీ ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ బాజీ బాబా పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్య విజయమని, శాంతి,సహనం,పట్టుదలకు దక్కిన విజయమని, భయాన్ని వీడి దేశం నలుమూలల నుండి ముందుకు వచ్చిన పౌరులందరీ సమిష్టి పోరాటం అని ఆయన అన్నారు. సిజేపి ఒక ఉద్యమాన్ని సృష్టించిందని, దీనికి అన్ని రాజకీయ పార్టీల మద్దతు లభించింది. బొద్దింకలు ఏమీ చేయలేవని బిజెపి అవహేళన చేసిందని, యువత విద్యార్థి లోకం అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో నేడు కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయక తప్పలేదని, ఆయన అన్నారు. ఇది ఒక వ్యక్తి రాజీనామా కాదు అని విద్యార్థి శక్తి ముందు అహంకార రాజకీయాలు తల వంచిన సందర్భం అని ఆయన అన్నారు.నీట్ పరీక్ష లీకేజీతో ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, వారంతో మంది ఆత్మ స్థైర్యాన్ని కోల్పోయారని, విద్యార్థుల భవిష్యత్తు గందరగోళంగా మారి దేశం మొత్తం యువత విద్యార్థి లోకం యావత్ ప్రపంచం పోరాటపటిమను చూపించిందని, జంతర్ మంతర్ లో శాంతియుతంగా నిరసన కార్యక్రమాన్ని విద్యార్థులు చేపట్టిన తరుణంలో వారిపై దౌర్జన్యంగా దుర్మార్గంగా, లాఠీ చార్జ్ చేయడం భాస్పవాయువు ప్రయోగించడం,పలు రకాల అణిచివేతలను దేశ యువత విద్యార్థి లోకం గట్టిగా ఎదుర్కొంది. దీంతో కేంద్రం దిగివచ్చి ఏదైతే విద్యార్థులు యువత పెట్టిన డిమాండ్లను పరిష్కరించే దిశగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయడం జరిగిందని ఆయన అన్నారు.నీట్ పరీక్ష లీకేజీతో ఎంతోమంది విద్యార్థులు తమ ప్రాణాలను కోల్పోయారని, అతి విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, అదేవిధంగా ఇప్పుడు ఉద్యమంలో ఎంతో మంది విద్యార్థులపై యువతపై కేసులో నమోదు అయ్యాయని అట్టి కేసులను వెంటనే ఎత్తివేయాలని, ఇండియన్ యూనియన్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ బాబా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేసిన సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్



**కేశంపేట, జులై 26, నేటి శుభోదయ :** కేశంపేట మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జటావత్ బన్ని (భర్త: బోజ్య నాయక్) కొంతకాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స ఖర్చులతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ ( సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.60,000 ఆర్థిక సహాయ చెక్కును గ్రామ సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ ఈరోజు బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్ మాట్లాడుతూ,,,పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో అండగా నిలుస్తోందని, అవసరమైన ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఈ ఆర్థిక సాయం అందించడం సంతోషకరమని పేర్కొన్నారు.చెక్కు అందుకున్న జటావత్ బన్ని కుటుంబ సభ్యులు సీఎం, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సర్పంచ్ పల్లె ఆనంద్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శేఖర్, ఉడిత్యాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత రైతుకు న్యాయం చేయాలని ప్రజాసంఘాల డిమాండ్.. చన్‌గోముల్ ఎస్సైపై చర్యలు తీసుకోవాలని వినతి

**వికారాబాద్ , జూలై 26, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా పూడూర్: పూడూర్ మండలం సోమన్‌గుర్తి గ్రామానికి చెందిన దళిత భూస్వామి నర్సిములు భూమిలో సుమారు 0.30 గుంటల స్థలాన్ని పక్కనే ఉన్న ఏస్ టైర్స్ కంపెనీ యాజమాన్యం అక్రమంగా ఆక్రమించిందని బాధితుడు ఆరోపిస్తున్న నేపథ్యంలో, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు యాలాల్ మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు. బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య మాట్లాడుతూ, బాధితుడు తన భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని, అలాగే ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేయాలని చన్‌గోముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ తగిన న్యాయం జరగలేదని ఆరోపించారు. భూమి ఆక్రమణ ఆరోపణలు ఎదుర్కొంటున్న కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిన బదులు బాధితుడిపైనే కేసు నమోదు చేయడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు.అలాగే కంపెనీ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తూ బాధితుడి పొలంలో ఎస్సై భరత్ కుమార్ రెడ్డి ఉచితంగా కంచె వేయించారనే ఆరోపణలు కూడా ఉన్నాయని తెలిపారు. ప్రజల హక్కులను కాపాడాల్సిన పోలీసు అధికారి పక్షపాత ధోరణితో వ్యవహరించారనే ఆరోపణలు పోలీసు వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నాయని అన్నారు.ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు స్వతంత్రంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని, బాధిత దళిత రైతుకు న్యాయం చేయాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేదా అధికార దుర్వినియోగం జరిగినట్లు తేలితే చన్‌గోముల్ ఎస్సై భరత్ కుమార్ రెడ్డిపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా పోలీసు యంత్రాంగాన్ని కోరాయి.ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సంఘం అధ్యక్షుడు కే. చంద్రయ్యతో పాటు నాయకులు రాములు, రఘుపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.






## ఖమ్మం జిల్లా ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా శెట్టి శ్రీనివాసరావు ఎన్ని

**ఖమ్మం, జులై 26, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా కామేపల్లి మండలం తాళ్ల గూడెం గ్రామానికి చెందిన శెట్టి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతోపాటు వర్కింగ్ ప్రెసిడెంట్లుగా అబ్బూరి ఉమామహేశ్వర రావు, షేక్ చాంద్ సాహెబ్, వైస్ ప్రెసిడెంట్లుగా ఇనపనూరి సుహాసిని, కొత్తపల్లి నాగార్జున, సోషల్ మీడియా కన్వీనర్ గుడిబోయిన అరవింద్ తో పాటు మరి కొంతమంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన కమిటీకి జిల్లా నలుమూలల నుంచి ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు శెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా ఉప సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం తనపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉప సర్పంచుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఉప సర్పంచులు గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి ఎదురవుతున్న పరిపాలనా, ఆర్థిక సమస్యలు ఎన్నో ఉన్నాయని పేర్కొన్నారు. ఉప సర్పంచులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి హక్కుల సాధనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



ప్రభుత్వం స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసి, ఉప సర్పంచులకు తగిన అధికారాలు, గౌరవం కల్పించాలని ఆయన కోరారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఉప సర్పంచులతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజలకు మెరుగైన సేవలందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా ఉపసర్పంచులందరికీ, ఫోరం నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో సంఘాన్ని మరింత బలోపేతం చేసి, ఉప సర్పంచుల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

## కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా వీర జవాన్లకు ఘన నివాళి : శంషాబాద్ మండల్ మాజీ జెడ్పిటిసి బుర్కుంట సతీష్.



**రాజేంద్రనగర్, జులై 26, నేటి శుభోదయ :** కార్గిల్ విజయ్ దివస్ (జూలై 26) సందర్భంగా దేశం కోసం ప్రాణాలను అర్పించిన అమర వీర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ వారికి హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నామన్నారు.వారి అసమాన ధైర్యసాహసాలు,దేశభక్తి ప్రతి భారతీయుడికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం.మన దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రాణత్యాగం చేసిన ప్రతి వీరుడికి శతశత నమస్సులు.బి.ఆర్.ఎస్ పార్టీ తరఫునఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి డైరెక్టర్,శంషాబాద్ మండల్ మాజీ జెడ్పిటిసి బుర్కుంట సతీష్కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమర జవాన్ల సేవలను చిరస్మరణీయంగా కొనియాడారు.

## ప్రతి నెల ఒకటవ తేదీనే జీతాలు చెల్లించాలి : ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం .డి యూసఫ్

**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :**
రాష్ట్రంలో ఎక్కడ మీటింగ్ జరిగిన ప్రతినెలా ఒకటవ తేదీనే కార్మికులకు ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి గ్రామపంచాయతీ కార్మికులకు మాత్రం ఒకటవ తేదీనే జీతాలు ఎందుకు చెల్లించడం లేదో సమాధానం చెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసఫ్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12వేల గ్రామపంచాయతీలో 54,000 మంది కార్మికులు పనిచేస్తున్నారని వారందరికీ ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. 1986 సంవత్సరం నుండి ఇంత వరకు గ్రామపంచాయతీ వర్కర్స్ ను నియమించటానికి ఒక్క పర్మినెంట్ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదంటే ఈ కార్మికులపై ప్రభుత్వాలు ఎంత వివక్షత చూపుతున్నాయో అర్థం చేసుకోవాలన్నారు. ప్రమాదంలో మరణించిన కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగ అవకాశము కల్పించాలన్నారు. సహజ మరణానికి 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాన్ని కార్మికులకు వెంటనే కల్పించాలన్నారు. రెండు మూడు దశాబ్దాలు పైగా పని చేసిన కార్మికులు 60 సంవత్సరాల నిండిన తర్వాత ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లవలసి వస్తుందని, సత్తువ మొత్తం వెట్టి చాకిరికే పోతుందని ఆయన వాపోయారు. 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికులకు 10 లక్షల రూపాయల సింగిల్ టైం గ్రాడ్యుటీ కింద మంజూరు చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అర్హతను బట్టి కార్మికులకు పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నత కల్పించాలన్నారు. రాబోవు పిఆర్సి లో గ గ్రామ




పంచాయతీ కార్మికులను అనువర్తింపజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, కొత్తగూడెం నగరం మేయర్ మూడు గణేష్, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. జి. క్లెమెంట్ , వెంకట రాజం జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులు రావి శివరామకృష్ణ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు రాష్ట్ర సమితి సభ్యులు సిహెచ్ సీతామహాలక్ష్మి , నిమ్మటూరి రామకృష్ణ, మల్లికార్జున్, గ్రామ పంచాయతీ ఉద్యోగ & కార్మిక సంఘం నాయకులు వాసిరెడ్డి మురళి, పిట్టల మల్లయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, రఘునా పాలెం మండల కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మిడ్జిల్ మండల అభివృద్ధిపై ఎంపీ డీకే అరుణతో బీజేపీ నాయకుల భేటీ



**మిడ్జిల్, జూలై 26, నేటి శుభోదయ :** మిడ్జిల్ మండల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించేందుకు జిల్లా బీజేవైఎం మాజీ అధ్యక్షుడు పల్లె తిరుపతి, మండల బీజేపీ అధ్యక్షుడు నరేందర్ ఆదివారం ఎంపీ డీకే అరుణను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తాగునీరు, రహదారులు, విద్య, వైద్య సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ సమస్యలను సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైన మేరకు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ భేటీలో మండల బీజేపీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కార్గిల్ యుద్ధంలో ప్రాణాలను సైతం లెక్కచేయక మాతృభూమి స్వేచ్ఛ కోసం పోరాడిన అమరవీరుల బలిదానం అజరామరం : బొక్క బాల్ రెడ్డి

**రాజేంద్రనగర్,జులై 26, నేటి శుభోదయ :**
పాకిస్తాన్ కుతంత్రాలను,కుట్రలను మంచు కొండల్లో తునాతునకలు చేసి..శత్రుమూకల పీచమణచి భారత త్రివర్ణ పతాకాన్ని గర్వంగా ఎగురవేసిన మన వీర సైనికుల త్యాగానికి శతకోటి ప్రణామాలు అని బిజెపి పార్టీ నాయకులు బొక్క బాల్రెడ్డి తెలిపారు.!.కార్గిల్ యుద్ధంలో ప్రాణాలను సైతం లెక్కచేయక మాతృభూమి స్వేచ్ఛ కోసం పోరాడిన అమరవీరుల బలిదానం అజరామరం.భారతదేశ సరిహద్దు భద్రతను,రక్షణ వ్యవస్థను సరికొత్త శిఖరాలకు చేర్చి,మన సైనికుల మనోధైర్యాన్ని కొండంతగా పెంచుతున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బలమైన,భయమెరుగని నవ భారతం ముందుకుసాగుతోందన్నారు.మాతృభూమి రక్షణే ఊపిరిగా పోరాడిన ప్రతి వీరుడికీ,వారికి అండగా నిలిచిన కన్నతల్లులకు హృదయపూర్వక సెల్యూట్ అయన తెలిపారు.



## కేశంపేటలో ఘనంగా టీఆర్ఎస్ జెండా పండుగ.. పార్టీ జెండా ఆవిష్కరణతో కార్యకర్తల్లో నూతన ఉత్సాహం



**కేశంపేట, జూలై 26, నేటి శుభోదయ :** కేశంపేట మండల కేంద్రంలో టీఆర్ఎస్ జెండా పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీమల రమేష్ కురుమ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి నాయకులు, కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి జెండా పండుగ రాష్ట్ర అబ్జర్వర్ తాండ్ర శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు.అదేవిధంగా షాద్‌నగర్ జెండా పండుగ ఇన్‌చార్జి శ్యామ్ హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు.జెండా ఆవిష్కరణ అనంతరం నాయకులు పార్టీ విజయాన్ని ఆకాంక్షిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, యువకులు, మహిళలు, అభిమానులు పాల్గొని జెండా పండుగను విజయవంతం చేశారు. కేశంపేట మండలంలో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తూ భవిష్యత్తు కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ వేడుక ఉత్సాహభరిత వాతావరణంలో సాగి పార్టీ కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు రంగన్న గౌడ్, ప్రవీణ్, ఆంగోతు రాజు, యువ నాయకుడు విజయ్ కుమార్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు

## పసిపాప ప్రాణాలకు పెద్దన్నగా నిలిచిన కౌన్సిలర్ కొత్తపల్లి శ్రీకాంత్ (నాని)

**సంగారెడ్డి , జూలై 26, నేటి శుభోదయ :**
'డబ్బు లేక చికిత్స ఆగకూడదు'... రూ.2 లక్షల ఆపరేషన్ ఖర్చు భరిస్తానని మానవత్వం చాటిన బిఆర్ఎస్ కౌన్సిలర్ నానిఆ చిన్నారికి ఇప్పుడే ఆరు సంవత్సరాలు ప్రపంచాన్ని అర్థం చేసుకునే వయసు కూడా రాకముందే జీవితం ఆమెను కఠిన పరీక్షకు గురిచేసింది. తీవ్ర కిడ్నీ వ్యాధితో ప్రతి రోజు ప్రాణాల కోసం పోరాడుతోంది. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం కుతుబ్షపేట గ్రామానికి చెందిన ఈ చిన్నారి జీవితంలో వరుసగా విషాదాలు చోటుచేసుకున్నాయి.కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చిన్నారి తల్లి మృతి చెందింది. అంతకుముందే తండ్రిని కూడా కోల్పోయింది. తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన ఆ పసిబిడ్డకు ఇప్పుడు నాయనమ్మే తల్లి, తండ్రి. వృద్ధాప్యంలోనూ మనవరాలి ప్రాణాలను కాపాడుకోవాలని ఆమె పడుతున్న తపన అందరినీ కంటతడి పెట్టిస్తోంది.చిన్నారికి వెంటనే శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. ఇందుకు సుమారు రూ.2 లక్షలు అవసరమని చెప్పడంతో, ఆర్థికంగా అత్యంత దుర్భర పరిస్థితుల్లో ఉన్న కుటుంబం ఏం చేయాలో తెలియక సహాయం కోసం ఎదురు చూసింది. పాప బాధను వివరిస్తూ సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు ఎంతోమంది హృదయాలను కదిలించాయి.ఆ వార్త సంగారెడ్డి పట్టణ బీఆర్ఎస్ కౌన్సిలర్ కొత్తపల్లి శ్రీకాంత్ (నాని) దృష్టికి చేరింది. వెంటనే చిన్నారి కుటుంబాన్ని కలిసి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. ఆ పసిపాప బాధను చూసి చలించిపోయిన ఆయన, "డబ్బు లేక ఒక చిన్నారి చికిత్స ఆగిపోకూడదు. ఆపరేషన్‌కు



అయ్యే మొత్తం ఖర్చు నేనే భరిస్తాను" అని భరోసా ఇచ్చారు.ఆ మాటతో ఆ కుటుంబంలో మళ్లీ ఆశ చిగురించింది. ఎన్నో రోజులుగా కన్నీళ్లతో గడిపిన నాయనమ్మకు ధైర్యం వచ్చింది. చిన్నారి కుటుంబ సభ్యులు శ్రీకాంత్ (నాని)కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ మంత్రి హరీశ్ రావు, కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు... ఈ మానవతా నిర్ణయాన్ని స్థానికులు, ప్రజాప్రతినిధులు, నెటిజన్లు హర్షిస్తున్నారు. "నిజమైన నాయకుడు ప్రజల కష్టాల్లోనే గుర్తింపును పొందుతాడు", "ట్రూ లీడర్ కొత్తపల్లి శ్రీకాంత్ (నాని)", "పేదల కష్టాన్ని తన కష్టంగా భావించిన ప్రజానాయకుడు" అంటూ ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.చిన్నారి జీవితంలో వెలుగులు నింపేందుకు ముందుకు వచ్చిన కొత్తపల్లి శ్రీకాంత్ (నాని) చేసిన ఈ సహాయం సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

## *విద్యార్థుల ఐక్యతకు లభించిన విజయం.. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాతో నిరసన విరమణ : సీఎం రేవంత్ రెడ్డి మిత్రమండలి కార్యదర్శి జంగయ్య

**మిడ్జిల్, జూలై 26, నేటి శుభోదయ :** సీజేపీ (CJP) పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమం తమ ప్రధాన డిమాండ్ నెరవేరిన అనంతరం విరమించుకోవడం విద్యార్థుల ఐక్యతకు, ప్రజాస్వామ్య పోరాటానికి నిదర్శనమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు,సీఎం రేవంత్ రెడ్డి మిత్రమండలి కార్యదర్శి పెరుమాళ్ల జంగయ్య పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసిన నేపథ్యంలో విద్యార్థులు తమ నిరసనను ముగించడం వారి పోరాటానికి లభించిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా చేపట్టే ఉద్యమాలు ప్రభుత్వాలను సైతం స్పందించేలా చేయగలవని ఈ ఘటన మరోసారి నిరూపించిందన్నారు. విద్యార్థుల సమస్యలను, వారి డిమాండ్లను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం స్పందించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.విద్యార్థులు దేశ భవిష్యత్తుకు ప్రతీకలని, వారి ఆవేదనను అర్థం చేసుకుని పరిష్కారం చూపడం ప్రతి ప్రభుత్వ బాధ్యత అని జంగయ్య అన్నారు. యువత ఐక్యంగా, క్రమశిక్షణతో తమ హక్కుల కోసం పోరాడినప్పుడు ప్రజాస్వామ్యంలో మార్పు సాధ్యమవుతుందని ఆయన చెప్పారు. ఉద్యమం లక్ష్యం నెరవేరిన తర్వాత శాంతియుతంగా నిరసనను విరమించుకోవడం విద్యార్థుల బాధ్యతాయుత వైఖరికి నిదర్శనమని కొనియాడారు.దేశ చరిత్రలో విద్యార్థి ఉద్యమాలు ఎన్నో కీలక మార్పులకు కారణమయ్యాయని గుర్తు చేసిన ఆయన, ప్రజాస్వామ్యంలో యువత పాత్ర ఎల్లప్పుడూ కీలకమని అన్నారు. ప్రభుత్వాలు ప్రజల అభిప్రాయాలను, ముఖ్యంగా విద్యార్థుల గొంతుకను గౌరవించాల్సిన అవసరం ఉందని సూచించారు.యువత సంకల్పం ముందు ఎంతటి అధికార వ్యవస్థ అయినా ప్రజాస్వామ్య పద్ధతిలో స్పందించక తప్పదని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సంఘటన దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు మరింత ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తుందని, హక్కుల కోసం చట్టబద్ధంగా, శాంతియుతంగా పోరాడితే



ఫలితం సాధ్యమవుతుందనే సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.చివరగా, విద్యార్థులు విద్యతో పాటు సామాజిక బాధ్యతను కూడా గుర్తుంచుకుని ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కృషి చేయాలని పెరుమాళ్ల జంగయ్య పిలుపునిచ్చారు. ఉద్యమం ముగిసినా, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు నిరంతరం కట్టుబడి ఉండాలని ఆయన కోరారు.

## డాక్టర్ మమతా రెడ్డి ని అభినందించిన ఎంపీ వద్దిరాజు



**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రాణాలు కాపాడిన డాక్టర్ మమతారెడ్డిని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర అభినందించారు.తీవ్ర గుండె పోటుకు గురై హన్మకొండలోని రోహిణి ఆస్పత్రిలో చేరిన సుదర్శన్ రెడ్డికి మమతారెడ్డి సీపీఆర్ చేయగా,గుండె తిరిగి కొట్టుకోవడంతో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారన్నారు.పెద్ది ప్రాణాలు కాపాడాలని డాక్టర్ 9 పర్యాయాలు సీపీఆర్ చేయడంతో గుండె తిరిగి కొట్టుకోవడంతో ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడడం "మెడికల్ మిరాకిల్"అని, అందుకు అకుంఠిత దీక్షతో కృషి చేసిన డాక్టర్ మమతారెడ్డి ప్రశంసనీయురాలని ఎంపీ వద్దిరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలు

**తలకొంపల్లి,జూలై 26, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల మాజీ ఎంపీపీ,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, వెల్జాల్ గ్రామ అభివృద్ధి ప్రదాత సీఎల్ శ్రీనివాస్ యాదవ్ జన్మదిన వేడుకలను శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ మండల వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు,సంబరాలు చేపట్టారు.శ్రీనివాస్ యాదవ్ పుట్టినరోజు వేడుకలను పెద్ద ఎత్తున విజయవంతం చేసినందుకు గాను కార్యకర్తలకు, పార్టీ నాయకులకు,అభిమానులకు వెల్జాల్ గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ తనయుడు, యువ నాయకుడు వానరాసి వెంకటేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా వానరాసి వెంకటేష్ మాట్లాడుతూ.. వెల్జాల్ గ్రామ అభ్యున్నతికి, మండల ప్రగతికి సిఎల్ శ్రీనివాస్ యాదవ్ చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని పార్టీ శ్రేణులు, గ్రామాల ప్రజలు చూపించిన ఉత్సాహం, అభిమానం అభినందనీయమన్నారు. శ్రీనివాస్ యాదవ్ మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని,ఆయన నాయకత్వంలో గ్రామం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని వెంకటేష్ ఆకాంక్షించారు.



## తెలంగాణ వాల్మీకి కార్పొరేషన్ సమీక్షా సమావేశంలో పాల్గొన్న గుజ్జుల మహేష్



**తలకొండపల్లి, జూలై 26, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, వైస్ చైర్మన్ నగేష్ అధ్యక్షతన హైదరాబాద్‌లో కీలక సమీక్షా సమావేశం జరిగింది. వాల్మీకి బోయల సంక్షేమం,ప్రభుత్వం నుంచి అందే వివిధ రకాల పథకాలు, సమాజ ఎదుగుదలకు సంబంధించిన ముఖ్య అంశాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు గుజ్జుల మహేష్ పాల్గొన్నారు.వాల్మీకి బోయ కులస్థులకు ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా,పారదర్శకంగా అందేలా చూడాలని,అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కార్పొరేషన్ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా చర్చించారు. వాల్మీకి బోయల సామాజిక,ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని,అందుకోసం కార్పొరేషన్ ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతుందని చైర్మన్ గట్టు తిమ్మప్ప వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, వాల్మీకి సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్ రైతు వేదికలో రెండు రోజుల పాటు విత్తన మేళా

**షాద్ నగర్,జులై 26, నేటి శుభోదయ :** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం అనిశ్చితంగా ఉన్న నేపథ్యంలో రైతులు వరి సాగుపై సందిగ్ధంలో ఉన్నారు ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటి అవసరమున్న పప్పుధాన్య పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది ఇందులో భాగంగా కొత్తూరు మండలంలోని తిమ్మాపూర్ రైతు వేదికలో ఈ నెల 27,28 తేదీల్లో రెండు రోజుల పాటు విత్తన మేళా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు విత్తన మేళాలో రైతులకు అవసరమైన కంది పెసర మినుము ఉలవలు అలసంద తదితర పప్పుధాన్యాల విత్తనాలతో పాటు రైతులు కోరే ఇతర పంటల విత్తనాలను కూడా అందుబాటులో ఉంచనున్నారు ఈ మేరకు కొత్తూరు మండలంలోని అన్ని విత్తన విక్రయ డీలర్లు తగినంత పరిమాణంలో నాణ్యమైన విత్తనాలను సిద్ధంగా ఉంచి సోమవారం నుంచి తిమ్మాపూర్ రైతు వేదికలో విక్రయించాలని సూచించారు రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండేలా డీలర్లు పూర్తి సహకారం అందించాలని విత్తన మేళా విజయవంతం కావడానికి అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడమే విత్తన మేళా ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు

## ఆరికాయలపాడు-జన్నారం వాగు దుస్థితి.. రైతుల కష్టాలు పట్టించుకునేదెవరు?

**ఏన్కూర్ , జూలై 26, నేటి శుభోదయ :** ఏన్కూరు మండల పరిధిలోని ఆరికాయలపాడు,జన్నారం గ్రామాల మధ్య ఉన్న వాగు రాకపోకలకు అనుకూలంగా లేకపోవడంతో రైతులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గం ద్వారానే రైతులు ప్రతిరోజూ తమ పంట పొలాలకు వెళ్లి వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు. అయితే వాగులో సరైన దారి లేకపోవడంతో వాహనాలు వెళ్లలేక రైతులు ప్రమాదాన్ని లెక్కచేయకుండా రాకపోకలు సాగిస్తున్నారు.వ్యవసాయ యంత్రాలు, ఎరువులు, విత్తనాలు, పంట ఉత్పత్తుల రవాణా కూడా తీవ్రంగా ప్రభావితమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత దయనీయంగా మారి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని చెబుతున్నారు.ఈ ప్రాంతానికి వంతెన మంజూరైనట్లు సమాచారం ఉన్నప్పటికీ, నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాకపోవడంతో రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు వాగులో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రైతులు సులభంగా పొలాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.అలాగే వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఈ సమస్యను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. మరమ్మతులతో పాటు వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేసి రైతుల ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆరికాయలపాడు, జన్నారం





గ్రామాల రైతులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సీతారామ జలాలతో వరి నాట్లు ప్రారంభం



**ఏన్కూర్, జూలై 26,, నేటి శుభోదయ :** ఏన్కూరు మండల పరిధిలోని అరికాయలపాడు గ్రామంలో సీతారామ ప్రాజెక్టు జలాలు వాగులకు చేరడంతో ఖరీఫ్ వరి సాగు పనులు ఊపందుకున్నాయి. సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతులు నారుమడులలో పెరిగిన వరి నారును పొలాల్లో నాట్లు వేశారు. గ్రామంలో వ్యవసాయ పనులు జోరుగా కొనసాగుతున్నాయి.ప్రస్తుతం సాగునీరు అందుతున్నందుకు రైతులు ఆనందం వ్యక్తం చేస్తూనే, భవిష్యత్తులో కూడా సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. సీతారామ ప్రాజెక్టు జలాలను అందించిన రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌కు రైతులు ,కూలీలు కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, జులై 26, నేటి శుభోదయ :** శంషాబాద్ మండలం రాళ్లగూడలోని శ్రీఅక్క మహాంకాళి,శ్రీబీరప్ప దేవాలయంలో నిర్వహించిన బోనాల మహోత్సవంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పేకాట రాయుడులపై ఉక్కు పాదం-స్థావరాలపై మెరుపు దాడి



**ఇబ్రహీంపట్నం , జులై 26, నేటి శుభోదయ :** యాచారం మండల పరిధిలోని మొగుళ్ల వంపు గ్రామంలో బర్ల కొట్టం,వ్యవసాయ పొలం వద్ద పేకాటరాయిడ్లు గత కొంతకాలంగా పేకాట ఆడుతున్నారని, పక్కా సమాచారంతో యాచారం పోలీసులు దాడికి దిగారు. ఈ పేకాట వల్ల కుటుంబాలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఉద్దేశంతో రైడ్ చేయగా. 3 బైకులు, 13,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై మధు తెలిపారు. పేకాట రాయిడ్లు ఈ ప్రాంతాన్ని కొద్ది కాలంగా ఎంచుకొని ఆడుతున్న విషయాలు ఎంతగానో ఇబ్బందికరంగా ఉన్నది. పేకాట అనే దూదంలో పాల్గొన్న వ్యక్తులు జోగు కృష్ణయ్య తండ్రి పేరు మైసయ్య, తాండ్ర లింగం తండ్రి పేరు వెంకటయ్య, నారుమల్ల రమేష్ తండ్రి పేరు యాదయ్య, విశ్వావత్ హారున్ తండ్రి మోహన్ లాల్, గుర్రం రంజిత్ తండ్రి పేరు నరసింహారెడ్డి, గడ్డం యాదయ్య తండ్రి పేరు సత్తయ్య, బోయన పెళ్లి లింగం తండ్రి పేరు సాయిలుగా పోలీసులు గుర్తించారు వీరిపై కఠిన చర్య తీసుకుంటామని ఎస్ హెచ్ ఓ నందీశ్వర్ రెడ్డి తెలిపారు.

## రాలగూడ ఫ్లై ఓవర్ కింద మురుగు నీరు చేరి వాన చోదకులకు తీవ్ర ఇబ్బందులు



**రాజేంద్రనగర్, జులై 26, నేటి శుభోదయ :** శంషాబాద్ సర్కిల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మురుగునీరు రోడ్డుపై ఏరులై పారుతున్న పట్టించుకునే పాపాన పోవడం లేదని వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా స్తంభించి పోవడం జరిగిందన్నారు.అయితే అధికారులు ముందస్తు చర్యలుగా చేపట్టకుండా ఎక్కడ లంచాలు ఇస్తే అక్కడ పనులు చేసే విధంగా వ్యవరిస్తున్నారు.దీంతో స్పందించి పోయిన డ్రైనేజ్ వ్యవస్థ పొంగిపొర్లి రాలగూడ ఫ్లై ఓవర్ కింద మురుగు నీరు అంతా చేరి వాన చోదకులకు ప్రయాణించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని వారు తెలిపారు.ఇప్పటికైనా శంషాబాద్ సర్కిల్ అధికారులు స్పందించి ఏరులై పారుతున్న మురుగునీటికి కట్టడి చేయాలని వాహన చోదకులు డిమాండ్ చేశారు.

## ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యకు యువత చొరవతో పరిష్కారం

**కేశంపేట, జులై 26, నేటి శుభోదయ :** కేశంపేట మండలం పోమాల్‌పల్లి గ్రామంలోని కాలనీ ప్రధాన రహదారిపై ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మాన్‌హోల్ గత ఆరు నెలలుగా పగిలిపోయి ప్రమాదకరంగా ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతిరోజూ చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణిస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు పలుమార్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను గ్రామ సర్పంచ్, డిప్యూటీ సర్పంచ్, గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ సూచన మేరకు స్థానిక యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మాన్‌హోల్ మరమ్మతు పనులు చేపట్టి సమస్యకు తాత్కాలిక పరిష్కారం చూపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని యువత చొరవతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు. ప్రజల సమస్యలను అధికారులు పట్టించుకోకపోయినా, యువత బాధ్యతగా వ్యవహరించి ప్రజలకు అండగా నిలవడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.గ్రామంలో మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం సరికాదని, ఇకనైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీలు, రోడ్లు, ప్రమాదకర మాన్‌హోల్స్ వంటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ప్రజల భద్రతను నిర్లక్ష్యం చేసే సంబంధిత అధికారులపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు, యువత కోరుతున్నారు.





## శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్‌లో (లక్ష్మి కెనాల్) విషాదం









**నిజామాబాద్ , జులై 26, నేటి శుభోదయ :** ముప్కాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు (ఎస్ఆర్ఎస్పీ) బ్యాక్‌వాటర్ ప్రాంతంలో ఆదివారం జరిగిన విషాదకర ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.సరదాగా విహారయాత్ర కోసం వచ్చిన నలుగురు యువకులు ప్రమాదవశాత్తు వరద కాలువలో జారిపడి గల్లంతయ్యారు.ప్రాథమిక సమాచారం ప్రకారం,ఆర్షాన్ (17),కలీం (24),అమ్ము అలియాస్ నజువత్ (24),అజీమ్ (24),ఖలీమ్ లు కలిసి శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రాంతానికి విహారయాత్రకు వెళ్లారు.ఈ సందర్భంగా వారు వరద కాలువ సమీపంలో ఉండగా ప్రమాదవశాత్తు కాలుజారి వేగంగా ప్రవహిస్తున్న నీటిలో పడిపోయి గల్లంతయ్యారు.సంఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు.పరిస్థితిని సమీక్షించి,గల్లంతైన వారిని వీలైనంత త్వరగా గుర్తించి బయటకు తీసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.పోలీసు శాఖ,రెవెన్యూ శాఖ,గజ ఈతగాళ్లు,ఎన్డీఆర్ఎఫ్ బృందాలు,అగ్నిమాపక సిబ్బంది సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి.నీటి ప్రవాహం అధికంగా ఉండటం,లోతు ఎక్కువగా ఉండటం వల్ల సహాయక చర్యలకు కొంత ఇబ్బంది ఎదురైనప్పటికీ బృందాలు నిరంతరంగా గాలింపు కొనసాగించాయి.గాలింపు చర్యల్లో గల్లంతైన నలుగురిలో ముగ్గురి మృతదేహాలను వెలికితీయడం జరిగింది.మరో వ్యక్తి మృతదేహం కోసం గజ ఈతగాళ్లు,ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు.సంఘటన స్థలంలో పోలీసు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ,అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపడుతున్నారు.ఈ సందర్భంగా ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి,ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి,ముప్కాల్ ఎస్ఐ సుహాసిని,ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది,రెవెన్యూ అధికారులు,ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సంఘటన స్థలంలో ఉండి సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నారు.ఈ విషాద ఘటన పట్ల నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,గల్లంతైన మరో వ్యక్తి కోసం అన్ని వనరులతో గాలింపు చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు విజ్ఞప్తి: వర్షాకాలంలో ప్రాజెక్టులు,బ్యాకవ◌ాటర్ ప్రాంతాలు,వరద కాలువలు,చెరువులు,నదుల వద్ద సెల్ఫీలు దిగడం,ఈత కొట్టడం లేదా సరదాగా నీటిలోకి వెళ్లడం అత్యంత ప్రమాదకరమని,ముఖ్యంగా నీటి లోతు,ప్రవాహం తెలియని ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ పోలీస్ శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.ప్రాణ భద్రతే అత్యంత ముఖ్యమని,ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండి పోలీసు,సంబంధిత శాఖల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## ఒక్క గ్రామంలోనైనా పూర్తిగా రైతు రుణమాఫీ జరిగినట్టు నిరూపించాలి

### : మంత్రి తుమ్మల కు సవాల్ విసిరిన మాజీ మంత్రి పువ్వాడ



**ఖమ్మం , జులై 26, నేటి శుభోదయ :** మోసపోతే గోస పడతామన్న కేసీఆర్ మాటలు నిజం అవుతున్నాయి అని తెలంగాణ రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదు కాంగ్రెస్ ప్రభుత్వానికి అదే జరుగబోతోంది అని తెలిపారు. ఆదివారం ఈర్లపూడి గ్రామంలో మాజీ మంత్రి పువ్వాడ పర్యటించారు. ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలోని ఈర్లపూడి గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. రఘునాథపాలెం మండలంలోని ఏ ఒక్క గ్రామంలోనైనా రైతులందరికీ పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ జరిగిందని నిరూపించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును డిమాండ్ చేశారు. గతంలో కూడా రైతు రుణమాఫీపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా వ్యక్తిగత దూషణలకు దిగారని, కానీ రైతులకు ఇచ్చిన హామీల అమలుపై మాత్రం స్పష్టత ఇవ్వలేదని 'ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్లు చరిత్రలో లేదు' అని పువ్వాడ విమర్శించారు.పాలించే నాయకుడి మనసు మంచిగా ఉంటే ప్రజలంతా సుఖసంతోషాలతో జీవిస్తారని, దానికి నాటి కేసీఆర్ పరిపాలన ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. కేసీఆర్ హయాంలో రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి రైతుబంధు, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, సకాలంలో ఎరువుల సరఫరా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు సమీపించినప్పుడు మాత్రమే రైతుబంధు నిధులను అరకొరగా జమ చేస్తోందని కేసీఆర్ పాలనలో రైతులకు సులభంగా అందుబాటులో ఉన్న యూరియాను ఇప్పుడు యాప్‌ల పేరుతో అందకుండా చేసి, గతంలో మాదిరిగా ఎరువుల కోసం రైతులు చెప్పులు అరిగేలా క్యూల్లో నిలబడే పరిస్థితి తీసుకొచ్చారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ విద్యుత్ కోతలు పెరిగాయని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడం, మోటార్లు కాలిపోవడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలకు బోనస్ ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ పూర్తిగా నీరుగారిపోయిందని, రైతులు మరోసారి మోసపోయారని విమర్శించారు. "మోసపోతే గోస పడతాం" అని కేసీఆర్ గతంలో చెప్పిన మాటలను గుర్తు చేస్తూ, కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఇప్పుడు అదే పరిస్థితిని అనుభవిస్తున్నారని అన్నారు. గత రెండు నెలలుగా వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ఉపశమన చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

# భారత ప్రధాని నరేంద్ర మోడీ136వ మనకి బాత్ వీక్షిస్తున్న బిజెపి శ్రేణులు

**రాజేంద్రనగర్, జూలై 26, నేటి శుభోదయ :** మణికొండలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ136వ మనకి బాత్ వీక్షించడం జరిగిందని మణికొండ బిజెపి పార్టీ అధ్యక్షులు రవికాంత్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో నరేంద్ర మోడీ దేశ ప్రజలను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ..ప్రజలకు నమస్కారం ఇవాళ కార్గిల్ విజయ దివాస్ జరుపుకోవడం జరుగుతుంది.అమర సైనికులనీ వీర సైనికులని గుర్తు చేయడం జరిగింది  అలాగే సైనికులు దేశంలోని ఎత్తైన పర్వతాలు కొండలలో చేస్తున్న విన్యాసాలను గుర్తు చేయడం జరిగింది.భారత నావికాదళం ఆధునికయుద్ధ నౌకను నావికాదళంలో ఐఏఎస్ విక్రాంతును ప్రవేశ పెట్టడం జరిగింది.ఇది ఎక్కువ శాతం పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించడం జరిగింది.దీనికి మన ఇంజనీర్లు డిఆర్డిఓ వారిని కొనియాడడం జరిగింది.సాంకేతిక యువత నైపుణ్యం ఆత్మవిశ్వాసం.ఆత్మనిర్భార్తో తయారు చేయడం జరిగిందని గుర్తు చేస్తున్నారు.అలాగే వర్షపు నీటిని ప్రతి ఒక్కరు ఒడిసి పట్టుకొని భావితరాలకు అందించుటకు కృషి చేయాలని కోరారు.యువత పివి సింధు జపాన్లో ట్రోఫీ గెలవడం జరిగిందని. అలాగే లార్డ్స్ లో మహిళా క్రికెట్ టీం టెస్ట్ మ్యాచ్ గెలిచిందని గుర్తు చేయడం జరిగింది.1983లో లార్డ్స్ లోనే ప్రపంచ కప్ మొదటిసారిగా గెలిచిందని గుర్తు చేశారు.భారతదేశ చరిత్రలో అంతరిక్షంలోకి విక్రమ్ దూసుకెళ్లడం జరిగిందని గుర్తు చేశారు.మన యువత సైన్స్ లో తలెత్తుకునే విధంగా ప్రయోగాలు చేస్తున్నారు.ఫిజిక్స్ కెమిస్ట్రీ బయోలాజికల్ పంపియార్డులో మన అయిదుగురు విద్యార్థులు బంగారు పథకాలు గెలుచుకున్నారు.ఇది ఇప్పటి వరకు ఉత్తమ ప్రదర్శన మ్యాథమెటిక్స్ లో కూడా పథకాలు సాధించారు.అదేవిధంగా జమ్మూ కాశ్మీర్లో గడ్డితో తయారు చేసే



చాపను గుర్తు చేశారు.కాశ్మీర్లోని ప్రజలు అక్కడ కొండల మధ్య పెరిగే గడ్డితోని తయారు చేస్తున్నారు అని కొనియాడారు.చాప విశిష్టత ఎండాకాలంలో చల్లగా వాన కాలంలో వెచ్చగా ఉంటుందని గుర్తు చేశారు.అలాగే స్థానిక ఉత్పత్తులను గుర్తు చేశారు ఓకల్ ఫర్ లోకల్.అలాగే మట్టితో తయారు చేసిన గణేష్ విగ్రహాలను పూజలలో వాడుకోవాల్సిందిగా కోరడం జరిగింది.ఎక్ పెడ్ మాకేనామ్ ప్రతి ఒక్కరు చెట్టును నాటుతూ ప్రకృతిని కాపాడవలసిందిగా కోరారు.అలాగే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయనని సేవలని గుర్తు చేశారు.అలాగే ఆగస్టు 15న జరగబోయే స్వాతంత్ర దినోత్సవంలో భరతమాత గర్వపడేలా ప్రతి ఒక్కరు పాల్గొంటూ తమ ఇంటి పైన త్రివర్ణ పతాకాన్ని పెట్టుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిద్ధప్ప,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# గోల్కొండ తొట్టెల ఎల్లమ్మ తల్లి ఊరేగింపులో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, జూలై 26, నేటి శుభోదయ :** కళా సిండికేట్ ఆధ్వర్యంలో ఆదివారం  గోల్కొండలోని బంజారా దర్వాజా వద్ద గల హనుమాన్ మందిర్ ప్రాంగణంలో ఘనంగా జరిగిన గోల్కొండ బోనాల  తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు.ఆదివారం మాజీ కౌన్సిలర్ మక్తాల కృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన ఈ వైభవ కార్యక్రమంలో ఎమ్మెల్యే  ప్రత్యేకంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన ఈ ఘనమైన ఊరేగింపు ఉత్సవాల్లో రాఘవ్, రాహుల్,వరుణ్ తేజ్ తదితర నిర్వాహకులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిని విమర్శించే స్థాయి మీకు ఉందా?

**నేటి శుభోదయ, యాదాద్రి భువనగిరి/ జులై 26:** కోమటిరెడ్డి బ్రదర్స్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని విమర్శించే స్థాయి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ మీకు ఉందా? ఆలోచించుకోవాలని  సంస్థాన్ నారాయణపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. సంస్థాన్ నారాయణపురంలోని మండల కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ఆదివారం  ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఎమ్మెల్యే మందుల సామెల్  వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో మీరు ఎవరు? కోమటిరెడ్డి బ్రదర్స్ పేరు చెప్పకుండా అధిష్ఠానం మీకు టికెట్ ఇచ్చిందా?అధిష్ఠానం మీకే టికెట్ ఇవ్వాలని ముందే నిర్ణయించి ఉంటే, కోమటిరెడ్డి బ్రదర్స్ ఇంటికి పదేపదే ఎందుకు వెళ్లారు అని ప్రశ్నించారు. కోమటిరెడ్డి బ్రదర్స్ అనుచరులు మీకు అండగా నిలవకపోతే, రాజగోపాల్ రెడ్డి స్వయంగా ప్రచారం చేసి, వందల మందికి ఫోన్ చేసి మీ గెలుపు కోసం కృషి చేసిన విషయం అంత త్వరగా మర్చిపోతే ఎట్లా? ఏరు దాటాక ఓడ మల్లయ్య--- ఏరు దాటాక బోడ మల్లయ్య" అన్న చందంగా ఉంది నీ పరిస్థితి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజగోపాల్ రెడ్డి చెప్పింది ఒక్కటే.. అందరినీ కలుపుకొని, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లండి అని. అందులో తప్పు ఏముందిని అన్నారు. ఇప్పుడు మీరు రాజకీయ చావుదెబ్బ కొడతా అని సవాళ్లు విసురుతున్నారు. దమ్ముంటే మాటల్లో కాదు, చేతల్లో చూపించండని సవాలు విసిరారు. దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, కోమటిరెడ్డి బ్రదర్స్ అనుచరుల మద్దతు లేకుండా ప్రజల తీర్పు కోరండి, అప్పుడు ఎవరి బలం ఎంతుందో ప్రజలే చెబుతారని అన్నారు. ఇతరులను విమర్శించే ముందు ఆత్మపరిశీలన చేసుకోవాలని, పార్టీలు ఏండ్ల తరబడి జెండా మోసి సేవ చేస్తున్న వారికి పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని చెప్పటం తప్పు, టిఆర్ఎస్ లో ఉండి ముఖము చెల్లక కాంగ్రెస్కు వచ్చి ఎమ్మెల్యేవు కాలేదా అని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇచ్చి



ఎమ్మెల్యే చేసినందుకు కోమటిరెడ్డి బ్రదర్స్ మీద మీరు చేసే కామెంట్స్ మీ చిత్తశుద్ధికి వదిలేస్తున్నామని అన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ ఎప్పుడూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులను ప్రోత్సహించారు. ఒకసారి ఎంపీ, ఒకసారి ఎమ్మెల్సీ, రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తిని, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా పనిచేసిన నాయకుడిని ఉద్దేశించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీకి సేవలందించాలని హితవు పలికారు. రాజగోపాల్ రెడ్డి ఒక పిలుపు ఇస్తే రాజకీయంగా పరిస్థితులు ఎలా మారతాయో ప్రజలకు తెలుసు. కాబట్టి బెదిరింపు రాజకీయాల కంటే, కార్యకర్తల మనసు గెలుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కత్తుల లక్ష్మయ్య, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎర్ర వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎర్ర సైదులు, పిట్ట కృష్ణ, సరిపల్లి సత్యనారాయణ, సిరి పంగి బాలకృష్ణ, కత్తుల మల్లయ్య, ముత్యాల శ్రీనివాసులు, మంచాల హిమాలయన్, దవుల నరసింహ, ముత్యాల నరసింహ, లింగవారిగూడెం గ్రామ శాఖ అధ్యక్షుడు కత్తుల విజయకుమార్, కత్తుల లింగయ్యలు పాల్గొన్నారు.

# హరివిల్లు గేటెడ్ కమ్యూనిటీలో ఎస్ఐఆర్‌పై అవగాహన : మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్,మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి



**రాజేంద్రనగర్, జూలై 26, నేటి శుభోదయ :** మణికొండ డివిజన్ పరిధిలోని హరి విల్లు గేటెడ్ కమ్యూనిటీలో ఆదివారం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్,మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి,మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుద్దోలు శ్రీరామ్ కమ్యూనిటీ వాసులను ఉద్దేశించి మాట్లాడారు.ప్రతి ఒక్క ఓటరు ఎస్ఐఆర్‌కు సంబంధించిన దరఖాస్తు ఫారాలను స్వీకరించి, వాటిలో అవసరమైన పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు.అనంతరం సంబంధిత బీఎల్‌ఓలకు అందజేయాలని కోరారు.ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు సక్రమంగా నమోదు కావడానికి ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని పేర్కొన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ వాసులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ అల్లం పేస్ట్ తయారీ కేంద్రంపై దాడి

## - అక్రమ తయారీ యూనిట్‌పై కేసు నమోదు

**నేటి శుభోదయ, యాదాద్రి భువనగిరి, జూలై 26:** యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ ఆదేశాల మేరకు చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో రామన్నపేట సీఐ ఎం. రవి, రామన్నపేట ఎస్సై జి. సతీష్, పోలీసు సిబ్బంది రామన్నపేట సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా, ఎటువంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా పెద్ద మొత్తంలో అల్లం పేస్ట్ డబ్బాలను తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహన డ్రైవర్‌ను విచారించగా, ఆ అల్లం పేస్ట్‌ను కీసర ప్రాంతంలోని ఒక తయారీ యూనిట్‌లో తయారు చేసినట్లు వెల్లడించాడు. వెంటనే పోలీసులు ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి కీసరలోని సంబంధిత తయారీ కేంద్రంలో సంయుక్తంగా దాడులు చేసి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో కల్తీ అల్లం పేస్ట్‌ను అక్రమంగా తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అనంతరం ప్రాంగణంలో సోదాలు నిర్వహించి, కల్తీ తయారీకి ఉపయోగిస్తున్న ముడి పదార్థాలు, యంత్రాలు, తయారైన అల్లం పేస్ట్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడే కల్తీ ఆహార పదార్థాల తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలపై




కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు కూడా ఆహార పదార్థాల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు లేదా ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

# జోరుగా వరినాట్లు ప్రారంభం



**ఖమ్మం, జూలై 26, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లాలో పలు ప్రాంతంలో గోదావరి జలాలు రావడంతో పలు చోట్ల వరినాట్లు జోరుగా ప్రారంభించారు. ఇప్పటికే పలు చోట్ల వరినారు పోసి సిద్ధంగా ఉన్న రైతులు ఆదివారం పలు చోట్ల వరినాట్లు వేశారు. ఈ దృశ్య మాలిక ఎంతో ఆకట్టుకుంది.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620